

జీవించేందుకే మనిషి తినాలి
సమాజ సంక్షేమానికి జీవించాలి
- డాక్టర్ బిఆర్ అంబేద్కర్

REGD NO : APTEL 16144

# జన స్వరం
పవర్
అక్షరమే ఆయుధం

www.janaswaram.com

**పాఠకులకు విజ్ఞప్తి**

జనస్వరం న్యూస్ తెలుగు దినపత్రిక నందు తక్కువ ఖర్చుతో పుట్టినరోజు శుభాకాంక్షలతో పాటు అన్ని కార్యక్రమాలకు ప్రకటనలకు సంప్రదించండి. మా మెయిల్ ఐడీ :
janaswaramnews@gmail.com
మొబైల్ నెంబర్ : 7013030690

సంపుటి : 4 | సంచిక : 273 | ఎడిటర్ : నరేష్ సాకే | తేది : 17-04-2025 | పేజీలు : 6

# రాష్ట్ర పునర్నిర్మాణానికి అండగా నిలవండి

- నేడు మీరు సాయం చేసి నిలబెడితే... రేపు దేశం సాధించే విజయాల్లో కీలకంగా ఉంటాం
- రాష్ట్రాన్ని ప్రత్యేకంగా చూసి ఆర్థిక సాయం అందించండి... స్వర్ణాంధ్ర 2047 ప్రణాళికకు ఊతం ఇవ్వండి
- రాష్ట్ర పరిస్థితిని అర్థం చేసుకుని అండగా నిలవాలని 16వ ఆర్థిక సంఘాన్ని కోరిన ముఖ్యమంత్రి
- గత ప్రభుత్వ హయాంలో నిలిచిపోయిన 93 కేంద్ర పథకాల్లో 72 తిరిగి ప్రారంభించాం : సీఎం చంద్రబాబు
- 16వ ఆర్థిక సంఘానికి స్వయంగా స్వాగతం పలికిన ముఖ్యమంత్రి చంద్రబాబు
- రాష్ట్ర పురోగతిపై ఫోటో ఎగ్జిబిషన్‌ను ఆర్థిక సంఘం ప్రతినిధులకు వివరించిన ముఖ్యమంత్రి
- రాజధాని విషయంలో రాష్ట్ర ప్రభుత్వ ఆలోచనలు వివరిస్తూ వీడియో ప్రదర్శన
- రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వాట్సాప్ గవర్నెన్స్‌కు ఆర్థిక సంఘం ప్రశంస... ప్రధానికి వివరించారా అని ఆరా తీసిన అరవింద్ పనగారియా



అమరావతి, ఏప్రిల్ 16 (జనస్వరం) : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 15 శాతం గ్రోత్ రేట్ లక్ష్యంగా ప్రణాళికలు సిద్ధం చేసుకుని పనిచేస్తుందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. ప్రభుత్వం 10 నెలలుగా తీసుకున్న చర్యలు, అమలు చేసిన విధానాల ద్వారా మెరుగైన ఫలితాలు సాధించామని సీఎం అన్నారు. రాష్ట్రంలో అనేక సమస్యలు ఉన్నాయని... దృఢమైన నిర్ణయాలతో, ఉత్తమ పాలసీలతో పాలన సాగిస్తూ సమస్యలను అధిగమిస్తున్నామని సీఎం అన్నారు. రాజధాని లేకపోవడం వల్ల రెవెన్యూ జనరేషన్‌కు అనేక సమస్యలు ఉన్నాయని సీఎం వివరించారు. ఈ కారణంగానే ప్రజల భాగస్వామ్యంతో ప్రపంచ స్థాయి రాజధాని నిర్మాణం చేపట్టామని రాష్ట్ర పర్యటనకు వచ్చిన 16వ ఆర్థిక సంఘం ప్రతినిధులకు ముఖ్యమంత్రి చంద్రబాబు వివరించారు.

**ఆర్థిక సంఘానికి సాదర స్వాగతం :**

రాష్ట్ర పర్యటనకు వచ్చిన 16వ ఫైనాన్స్ కమిషన్‌కు సచివాలయం మొదటి బ్లాక్ వద్ద ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్వయంగా స్వాగతం పలికారు. అనంతరం సచివాలయం మొదటి బ్లాక్‌లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్‌ను ఆర్థిక సంఘం ప్రతినిధులకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వివరించారు. రాజధాని అమరావతి నిర్మాణం, పోలవరం ప్రాజెక్టు, పోలవరం - బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టు వంటి అంశాలపై ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను ఆర్థిక సంఘం ప్రతినిధులకు వివరించారు. రాజధాని విషయంలో రాష్ట్ర ప్రభుత్వ ఆలోచనలు వీడియో రూపంలో ప్రదర్శించి వివరించారు. రాష్ట్ర విభజన ప్రభావం, ఆర్థిక సవాళ్లు, 2014 తరువాత వృద్ధిరేటులో రాష్ట్రం సాధించిన ప్రగతి, ప్రవేశ పెట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై ఆర్థిక సంఘానికి సీఎం వివరించారు.

**గత ప్రభుత్వంలో ఐదేళ్లూ తీవ్ర నష్టం**

2019 తరువాత నాటి ప్రభుత్వం అనుసరించిన విధానాల కారణంగా రాష్ట్ర ప్రజలకు, ఆర్థిక వ్యవస్థకు జరిగిన నష్టాన్ని సీఎం వివరించారు. గత 10 నెలల కాలంలో చేపట్టిన కార్యక్రమాలు, స్వర్ణాంధ్ర విజన్ 2047, మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు, పెట్టుబడులకు ఉన్న అనుకూలతలు, రాష్ట్ర ప్రభుత్వ పాలసీలు ప్రజెంటేషన్ ద్వారా సీఎం వివరించారు. గత 5 ఏళ్ల కాలంలో ఆర్థికంగా జరిగిన విధ్వంసం కారణంగా నేడు ఎదుర్కొంటున్న సవాళ్ల నేపథ్యంలో కేంద్రం అదనపు సాయం అందించాలని కోరిన సీఎం...రాష్ట్రంలో నెలకొన్ని ప్రత్యేక పరిస్థితులు దృష్ట్యా కేంద్రం కేటాయింపులు జరిపేలా సిఫారసులు చేయాలని సీఎం విన్నవించారు.

**పనగారియా సేవలు ఎంతో విలువైనవి :**

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ "16వ ఆర్థిక సంఘం ఛైర్మన్ అరవింద్ పనగారియా ఎంతో అనుభవం ఉన్న వ్యక్తి. ఆయన దేశానికి చేస్తున్న సేవలు ఎంతో విలువైనవి. పనగారియా నీతి ఆయోగ్‌లో పని చేసిన సమయంలోనే పోలవరం ప్రాజెక్టును రాష్ట్రానికి అప్పగించారు. దేశంలో ఉన్న ఇతర జాతీయ ప్రాజెక్టుల పురోగతి మందగించడంతో పోలవరం ప్రాజెక్టు పూర్తి కావాలంటే రాష్ట్ర ప్రభుత్వమే చేపట్టాలని సిఫారసు చేశారు. వచ్చే పుష్కరాలకు ముందే పోలవరం ప్రాజెక్టును పూర్తి చేస్తాం. ప్రాజెక్టు ప్రారంభోత్సవానికి మీరు కూడా రావాలని కోరుతున్నాను" అని సిఎం అన్నారు.

**మోదీ నాయకత్వంలో దేశ ముఖచిత్రం మారుతోంది :**

"ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం వికసిత్ భారత్ వైపు ప్రయాణిస్తోంది. ఒకప్పుడు దేశ వృద్ధి రేటు చూసి ప్రపంచం హేళన చేసేది. కానీ నేడు ప్రపంచం గర్వించే స్థాయిలో భారత్ వృద్ధి సాధిస్తోంది. నేడు మనం ప్రపంచంలో 5వ పెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉన్నాం... 2028 నాటికి మూడవ స్థానానికి చేరుకుంటాం. 2047 నాటికి ప్రపంచంలో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మనం అభివృద్ధి చెందుతాం. మరోవైపు ప్రపంచ వ్యాప్తంగా భారతీయులు సాధిస్తున్న విజయాలు స్ఫూర్తివంతంగా ఉంటున్నాయి. సంస్కరణలు దేశ ముఖచిత్రాన్ని మార్చే ఫలితాలను ఇస్తున్నాయి. ఉమ్మడి ఏపీలో తెచ్చిన అనేక సంస్కరణలు అనేక మార్పులు తెచ్చాయి. ఉమ్మడి రాష్ట్రంలో ఉన్నప్పుడు ఐటీని ప్రోత్సహించాం. మంచి ఫలితాలు వచ్చాయి. నేడు ఏఐ గురించి మాట్లాడుతున్నాం. జనాభా విషయంలో కూడా మేం ఒక పాలసీ తీసుకున్నాం. జనాభా నియంత్రణ నుంచి జనాభా నిర్వహణ వైపు ఆలోచిస్తున్నాం. ఇది భారత దేశానికి కీలకమైన దశ. అమృత్ కాల్ అని చెప్పాలి. దేశం అతి గొప్ప విజయాలు సాధించేలా ఫైనాన్స్ కమిషన్ కీలక భూమిక పోషించాలి అని కోరుకుంటున్నా" అని సిఎం అన్నారు.

**4 సార్లు సీఎంగా చేసినా ఇన్ని సవాళ్లు చూడలేదు :**

"నేను ప్రస్తుతం నాలుగవ సారి సీఎంగా ఉన్నాను. కానీ ఇన్ని సవాళ్లు, ఇన్ని ఆర్థిక కష్టాలు ఎప్పుడూ చూడలేదు. గత ప్రభుత్వం చేసిన ఆర్థిక అరాచకత్వానికి రాష్ట్రం తీవ్రంగా నష్టపోయింది. అప్పుల కోసం గత ప్రభుత్వం తహసీల్దార్ ఆఫీస్ లు కూడా తాకట్టు పెట్టింది. 25 ఏళ్లకు మద్యంపై వచ్చే ఆదాయాన్ని తాకట్టు పెట్టింది. ఇలాంటి సమస్యల నుంచి బయటకు వచ్చి రాష్ట్రాన్ని నిలబెట్టేందుకు గట్టి సంకల్పంతో పనిచేస్తున్నాం. సంక్షేమ, అభివృద్ధి బ్యాలెన్స్ చేసుకుంటూ.....సుపరిపాలన అందిస్తున్నాం. ఇలాంటి సమయంలో...ఈ రోజు మేం నిలబడేందుకు, ముందుకు వెళ్లేందుకు మీరు సాయం చేస్తే...రేపు పుంజుకుని మాకున్న బలం ద్వారా అనూహ్య విజయాలు సాధిస్తాం. వికసిత్ భారత్ లక్ష్యాన్ని చేరుకోవడంలో మా వంతు పాత్ర పోషిస్తాం. తద్వారా దేశ నిర్మాణంలో ముఖ్యమైన రాష్ట్రంగా నిలుస్తాం. సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేసేందుకు, ఉద్యోగ కల్పనకు అవసరమైన పెట్టుబడులు సాధించేందుకు మేం అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నాం. జాబ్ ఫస్ట్ అనే నినాదంతో...స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ అనే విధానంతో మేం పని చేస్తున్నాం"అని ముఖ్యమంత్రి వివరించారు.

**వాట్సప్ గవర్నెన్స్‌కు హ్యాట్సాఫ్ :**

అనంతరం వివిధ అంశాలపై ఆర్థిక సంఘం తమ అభిప్రాయాలు చెప్పింది. రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన వాట్సాప్ గవర్నెన్స్ పై ఛైర్మన్ తో పాటు కమిషన్ సభ్యులు ప్రశంసలు తెలిపారు. వాట్సాప్ గవర్నెన్స్ విధానాన్ని ప్రధాని నరేంద్ర మోదీ దృష్టికి తీసుకువెళ్లారా అని సీఎంను పనగరియా అడిగారు... ఇంకా లేదని, వచ్చే నెలలో ప్రధానితో భేటీ సందర్భంగా ఆయనకు ఈ ప్రాజెక్ట్‌పై వివరిస్తామని సీఎం తెలిపారు. ప్రభుత్వ సేవలకు కార్యాలయాలకు వెళ్లే అవసరం లేకుండా ప్రతి ఒక్కరూ వాట్సాప్ ద్వారా సేవలు పొందే పరిస్థితి తీసుకువస్తున్నామని రానున్న రోజుల్లో 1000 సేవలు అందిస్తామని సీఎం ఈ సందర్భంగా చెప్పారు. ఒక ముఖ్యమంత్రి స్వయంగా ఆర్థిక అంశాలపై ప్రజెంటేషన్ ఇవ్వడం తమను ఎంతో ఆశ్చర్య పరిచిందని, వృద్ధి గణాంకాలపై ఇంత లోతుగా విశ్లేషించడం, కేంద్ర సాయం పొందేందుకు చేస్తున్న ప్రయత్నాలను పనగారియా ప్రశంసించారు. మరోవైపు 30 ఏళ్ల క్రితం తాను హైదరాబాద్ వెళ్లిన నాటికి... నేటికీ ఎంతో అభివృద్ధి చెందిందని.. ఇదంతా ముఖ్యమంత్రి చంద్రబాబు విజన్ వల్లే సాధ్యమైందని ఆర్థిక సంఘం సభ్యురాలు అన్నెజార్జ్ మాథ్యూ అన్నారు. అమరావతి కూడా అదే స్థాయిలో చంద్రబాబు అభివృద్ధి చేస్తారనే నమ్మకం ఉందన్నారు.

**16వ ఆర్థిక సంఘానికి రాష్ట్ర ఆర్థిక స్థితిగతులపై ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజంటేషన్ :**

**ఏపీ వృద్ధికి అనుకూలతలు :**

అతిపెద్ద తీర ప్రాంతం కలిగిన ఆంధ్రప్రదేశ్ తూర్పు దేశాలకు గేట్‌వేగా ఉంది. 3 పారిశ్రామిక కారిడార్లు, విశాఖ-చెన్నయ్, చెన్నయ్-బెంగళూరు, బెంగళూరు-హైదరాబాద్ కారిడార్లు ఉన్నాయి. 6 పోర్టులు, 7 ఎయిర్ పోర్టులు ఉన్నాయి. దేశ ఎగుమతుల్లో 5.8 శాతం రాష్ట్రం నుంచే అవుతున్నాయి. బ్లూ ఎకానమి, ఐటీ, నాలెడ్జ్ ఎకానమి, క్వాంటమ్ వ్యాలీ, డ్రోన్, ఐవోటీ, బ్లాక్ చెయిన్ వంటి నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవడంలో రాష్ట్రం ముందుంది. గ్రీన్ హైడ్రోజన్, సోలార్, అమోనియా... ఇలా గ్రీన్ ఎనర్జీకి ఏపీ హబ్‌గా ఉంది. అటు హైదరాబాద్, బెంగళూరు, చెన్నయ్ వంటి నగరాలు అమరావతికి చేరువలో ఉన్నాయి. ఈ నాలుగు నగరాలను కలుపుతూ దక్షిణ భారత దేశం మరింత అభివృద్ధి చెందేలా ప్రణాళికలు సిద్ధం చేస్తే వికసిత్ భారత్ లక్ష్యంలో భాగం అవుతుంది.

**స్వర్ణాంధ్ర-2047 విజన్ :**

భారతదేశాన్ని 2047 కల్లా వికసిత్ భారత్‌గా తీర్చిదిద్దాలన్న లక్ష్యంలో భాగంగా ఆంధ్రప్రదేశ్‌కు విజన్ రూపొందించుకున్నాం. హెల్తీ, వెల్తీ, హ్యాపీ రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ తీర్చిదిద్దాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. స్వర్ణాంధ్ర-2047 విజన్‌తో పది సూత్రాల ప్రణాళిక అమలు చేస్తున్నాం. ప్రతి కుటుంబానికి కనీస అవసరాలు తీర్చాలన్నదే ప్రభుత్వ లక్ష్యం. ప్రతి ఒక్క కుటుంబానికి సొంతిళ్లు, పరిశుభ్రమైన మరుగుదొడ్లు, కుళాయి కనెక్షన్, వంటగ్యాస్, సమృద్ధిగా విద్యుత్ సరఫరా, హైస్పీడ్ ఇంటర్నెట్ అందించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం. అటు గ్రామాల్లో రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం, చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రాలు, విద్యుత్ ఆదా చేసే వీధి లైట్లు, పాఠశాలలు, ఆరోగ్యకేంద్రాలు బలోపేతం చేసేలా చర్యలు చేపట్టాం.

**వినూత్న కార్యక్రమం పీ4 :**

జీరో పావర్టీ లక్ష్యంగా సమాజంలో అట్టడుగున ఉన్న 20 శాతం మంది పేదలను...అత్యున్నత స్థానంలో ఉన్న 10 శాతం మంది సంపన్నులు ఆదుకేనే పీ4 కార్యక్రమానికి శ్రీకారం చుట్టాం. సమాజంలో అసమానతలు తొలిగేలా చేయాలన్నది ప్రభుత్వ సంకల్పం. జనాభా వృద్ధిపైనా దృష్టి సారించాం.

**స్వర్ణాంధ్ర - 2047 లక్ష్యాలు :**

ఏడాదికి 15 శాతం వృద్ధి రేటు సాధించి 2047 కల్లా 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఆంధ్రప్రదేశ్ అవతరించేలా కృషి చేస్తున్నాం. అలాగే తలసరి ఆదాయం 42,000 వేల డాలర్లకు చేరడంతో పాటు ఎగుమతులు 450 బిలియన్ డాలర్లు, సగటు జీవిత కాలం 85 ఏళ్లు, అక్షరాస్యత 100 శాతం సాధించడం, నిరుద్యోగ రేటు 2 శాతానికి మించకుండా అభివృద్ధి చెందేలా చూస్తున్నాం.

**రూ.40 లక్షల కోట్ల పెట్టుబడులు అవసరం :**


ప్రస్తుతం జీఎస్డీపీ రూ.18.25 లక్షల కోట్లు ఉండగా, 2028-29 నాటికి రూ.29.29 లక్షల కోట్లకు చేరుకోవాలనేది లక్ష్యం. ఇది సాకారం కావాలంటే 2029 కల్లా రూ.40 లక్షల కోట్ల పెట్టుబడులు రావాల్సి ఉంది.

**2014-15 నాటికి వివిధ రంగాల వాటా :**

2014లో రాష్ట్ర విభజనతో ఆదాయ వనరులు అన్నీ తెలంగాణకు వెళ్లాయి. కేవలం ప్రాథమిక రంగంపైన మాత్రమే ఆంధ్రప్రదేశ్ ఎక్కువ ఆధారపడాల్సి వచ్చింది. 2014లో ఏపీకి 31శాతం ఆదాయం ప్రధానంగా వ్యవసాయ రంగం నుంచి వస్తే, తెలగాణ రాష్ట్రానికి 16 శాతం మాత్రమే ఆదాయం వచ్చింది. అలాగే పరిశ్రమల రంగం నుంచి ఏపీకి 25 శాతం, తెలంగాణకు 22 శాతం, సేవల రంగం నుంచి ఏపీకి 44 శాతం, తెలంగాణ 61 శాతం వాటా ఉంది.

మిగతా 3లో..

## జీవితం - వి"చిత్రం"




## ఈ రోజు పంచాంగం వేళలు

తేదీ : 17 ఏప్రిల్ 2025,
తిథి : శుద్ధ చవితి (మ.03:26వ.కు),
నక్షత్రం : అనూరాధ (ఉ.05:55వ.కు)
బ్రహ్మ ముహూర్తం : తె.04:19ల తె.05:07
రాహుకాలం : మ.01:40ల మ.03:13,
యమగండం : ఉ.05:55ల ఉ.07:28,
వర్జ్యకాలం : మ.12:07 మ.02:06

## ఈ రోజు నమాజ్ వేళలు

తేదీ : 17 ఏప్రిల్ 2025,
ఫజర్ : తెల్లవారుజామున గం. 04:52
సూర్యోదయం : ఉదయం గం. 06:05
జోహర్ : మధ్యాహ్నం గం. 12:20
అసర్ : సాయంత్రం గం. 03:32
మఘ్రిబ్ : సాయంత్రం గం. 06:34
ఇష : రాత్రి గం. 07:47




**జన స్వరం**

**విలేకరులు కావలెను**

"జనస్వరం" ఈ-దినపత్రిక (వెబ్ పత్రిక) నందు పని చేయుటకు రెండు తెలుగు రాష్ట్రాల్లో జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయి విలేకరులు కావలెను.. అసక్తి ఉన్న వారు సంప్రదించండి..

సాయి కల్యాణ్
ఫోన్ నెం : 7013030690
మేనేజింగ్ డైరెక్టర్, జనస్వరం మీడియా

# ట్రై సిటీస్.. ఇక మూడు నగరాలూ వెలిగిపోనున్నాయిగా

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని ఆలోచిస్తారు. హైదరాబాద్‌లో సైబరాబాద్ నిర్మాణం జరిగినట్లుగానే అమరావతి నిర్మాణంలోనూ ఆయన చాలా విజన్‌తో నిర్మాణం చేయాలని భావిస్తున్నారు. ఎవరెన్ని విమర్శలు చేసినా లెక్క చేయదలచుకోలేదు. తన పేరు ఇప్పుడు హైదరాబాద్‌లో స్థిరంగా ఉన్నట్లుగానే, ఆంధ్రప్రదేశ్‌లోనూ కలకాలం నిలిచిపోవాలని ఆయన ఆకాంక్షగా కనిపిస్తుంది. అందుకే ఎన్ని వ్యయ ప్రయాసలకు ఓర్చినా, ఎవరు ఏమి అనుకున్నా పెద్దగా పట్టించుకోవడం లేదు. హైదరాబాద్‌ను మించిన నగరాన్ని అమరావతిలో నిర్మించి ఆంధ్రప్రదేశ్‌కు సంపద సృష్టించే నగరంగా మార్చాలని ఆయన ప్రయత్నిస్తున్నారు. నిధులు వెచ్చించడానికి...ఇందుకోసం ఆయన పెద్ద ఎత్తున నిధులు ఖర్చు చేయడానికి కూడా వెనకాడటం లేదు. రాజధాని నిర్మాణంపై పెట్టే ప్రతి పైసా తిరిగి కోట్ల రూపాయల్లో తిరిగి ప్రభుత్వానికి ఆదాయం రూపంలో వస్తుందని ఆయన అంచనా వేస్తున్నారు. ఒక్కసారి తాను అనుకున్న ప్లాన్ ప్రకారం రాజధాని నిర్మాణం పూర్తయితే ఉపాధి అవకాశాలు పెరగడమే కాకుండా రాజధాని అమరావతి ప్రపంచంలోనే అతి పెద్ద నగరంగా అవతరిస్తుందని అంచనా వేస్తున్నారు. ఇప్పటికే 33 వేల ఎకరాలను సేకరించిన చంద్రబాబు నాయుడు మరో నలభై వేల ఎకరాలను సేకరించి అందులో అంతర్జాతీయ విమానాశ్రయాన్ని నిర్మించడంతో పాటు స్పోర్ట్స్ సిటీని కూడా ఏర్పాటు చేయాలని గట్టిగా నిర్ణయించారు. వచ్చే నెల 2వ తేదీన ప్రధాని.. వచ్చే నెల 2వ తేదీన ప్రధాని మోదీ రాజధాని అమరావతి పునర్నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయనున్నారు. అప్పటి నుంచి ఇక పనులు వేగం పుంజుకోనున్నాయి. మొదట సెక్రటేరియట్, అసెంబ్లీ, హైకోర్టు నిర్మాణం చేపడితే అమరావతి ఒక రూపు వస్తుంది. దీంతో పాటు వివిధ విద్యాసంస్థలు కూడా అమరావతి ప్రాంతానికి రానున్నాయి. దీంతో రాజధాని అమరావతిలో ప్రజలు నివాసానికి తగిన ఏర్పాట్లు చేసుకునే అవకాశాలున్నాయి. రియల్ ఎస్టేట్ వ్యాపారం కూడా పెరగనుంది. పెద్ద వెంచర్లు రానున్నాయి. భూములిచ్చిన రైతులు కూడా తమకు అలాట్ చేసిన ప్లాట్లలో ఇళ్ల నిర్మాణానికి సిద్ధమవుతే రాజధాని అమ



## ఎడిటోరియల్

రావతికి పూర్తి రూపం వస్తుందని చంద్రబాబు అంచనా వేస్తున్నారు. మూడు నగరాలు కలిస్తే.. ఇదే సమయంలో మరో కీలక నిర్ణయం తీసుకున్నారు. అమరావతి, గుంటూరు, విజయవాడ, తాడేపల్లి, మంగళగిరి కలిపి ఇక మెగాసిటీగా రూపకల్పన చేయాలని చంద్రబాబు నిర్ణయించారు. నిజానికి ఈ విజయవాడ, గుంటూరు పట్టణాలు ఇప్పటికే కలిశాయి. దీనికి అమరావతి కూడా తోడయితే మూడు నగరాలు కలిసి మరింత పెద్ద నగరంగా అభివృద్ధి చెందే అవకాశముంది. అదే సమయంలో మూడు నగరాలు కలిస్తే దాదాపు చిలకలూరిపేట వరకూ ఆంధ్రప్రదేశ్ రాజధాని విస్తరించే అవకాశముందని ముఖ్యమంత్రి చంద్రబాబు అంచనా వేస్తున్నారు. అదే జరిగితే హైదరాబాద్ కు మించిన నగరాన్ని అత్యంత వేగంగా నిర్మించి చరిత్రకు ఎక్కవచ్చన్నది చంద్రబాబు ఆలోచన. మరి ఏం జరుగుతుందన్నది చూడాలి.



జమ్ము సాయి కల్యాణ్,
పొలిటికల్ అనలిస్టు,
మేనేజింగ్ డైరెక్టర్,
జనస్వరం మీడియా.

## ఏపీకి అత్యధిక పతకాలు సాధించిపెట్టాలి

**- శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు**

**- ఏపీ క్రీడా జట్టుల ఎంపికలు ప్రారంభం**



**విజయవాడ, ఏప్రిల్ 16 (జనస్వరం) :** ఆంధ్రప్రదేశ్ నుంచి రాణించే క్రీడాకారులందరూ అత్యధిక పతకాలు సాధించి రాష్ట్ర ఖ్యాతిని విస్తృతం చేయాలని ఏపీ స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మన్ అనిమిని రవి నాయుడు పేర్కొన్నారు. బీహార్ రాష్ట్రంలో మే 2వ తేదీ నుంచి 15వ తేదీ వరకూ జరగనున్న 7వ ఎడిషన్ ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌లో ఆంధ్రప్రదేశ్ నుంచి ప్రాతినిథ్యం వహించేందుకు విజయవాడ ఐజీఎంసీ స్టేడియంలో ఏపీ స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కబడ్డీ, ఖోఖో, ఫుట్‌బాల్ జట్టుల ఎంపికల ప్రక్రియను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏపీ నుంచి ప్రాతినిథ్యం వహించేందుకు బాలుర, బాలికల జట్టుల ఎంపికలకు వచ్చిన క్రీడాకారులను పరిచయం చేసుకుని ప్రోత్సహించారు. ఈ సందర్భంగా శాప్ ఛైర్మన్ మాట్లాడుతూ క్రీడాకారుల ప్రతిభ, ప్రదర్శనల మీదే వారి భవిష్యత్తు ఆధారపడి ఉంటుందని, ముఖ్యంగా సమాజంలో తగిన గుర్తింపు, గౌరవం లభిస్తాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడాకారులకు కల్పిస్తున్న పథకాలు, పాలసీలపై ప్రతీ ఒక్కరూ అవగాహన పెంచుకుని సద్వినియోగం చేసుకోవాలన్నారు. క్రీడాప్రోత్సాహకాలను అందించే విషయంలో రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందన్నారు. అత్యధిక పతకాలు సాధించి రాష్ట్ర గౌరవాన్ని పెంచాల్సిన బాధ్యత క్రీడాకారులపైనే ఉందని సూచించారు.

## ధీరజ్ శ్రీకృష్ణను సన్మానించిన రాష్ట్ర గవర్నర్



**విజయవాడ, ఏప్రిల్ 16 (జనస్వరం) :** విజయవాడకు చెందిన ధీరజ్ శ్రీకృష్ణ ఇటీవల సింగపూర్‌లో జరిగిన పదవ ఏషియన్ యోగ చాంపియన్‌షిప్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించిన ట్రెడిషనల్, ఆర్టిస్ట్ విభాగాలలో బంగారు పతకలు సాధించి తిరిగి వచ్చారు. ఈ నేపథ్యంలో బుధవారం రాష్ట్ర గవర్నర్ రాజ్ భవన్‌లో అబ్దుల్ నజీర్ ధీర శ్రీకృష్ణను ప్రత్యేకంగా అభినందించినట్లు యోగా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ ప్రధాన కార్యదర్శి అవినాష్ శెట్టి తెలిపారు. ధీరజ్ శ్రీకృష్ణ రానున్న రోజుల్లో మరిన్ని అంతర్జాతీయ వేదికలపై పథకాలు సాధించి దేశంతో పాటు రాష్ట్రానికి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని గవర్నర్ ఆకాంక్షించారు. ధీరజ్‌తోపాటు వాళ్ళ తల్లిదండ్రులు ఉన్నారు

## ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా "ఆంధ్రజ్యోతి" బ్యూరో ఇంచార్జికి పితృవియోగం

**- నివాళులర్పించిన ఏపీఎస్ ఆర్టీసీ విజయవాడ జోనల్ చైర్మన్, ఏలూరు నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ రెడ్డి అప్పల నాయుడు**



**ఏలూరి, ఏప్రిల్ 16 (జనస్వరం) :** ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ఆంధ్రజ్యోతి దినపత్రిక బ్యూరో ఇన్‌ఛార్జ్ జీ.వి.ఎస్.ఎన్.రాజు తండ్రి గొట్టుముక్కల సీతారామ రాజు (96) బుధవారం స్వర్గస్తులయ్యారు. అనారోగ్య కారణాలతో ఆశ్రం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆయన తుది శ్వాస విడిచారు. ఆయన మృతదేహాన్ని శనివారపు పేటలోని వారి స్వగృహానికి తరలించారు. విషయం తెలుసు కున్న ఏపీఎస్ ఆర్టీసీ విజయవాడ జోనల్ చైర్మన్, ఏలూరు నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ రెడ్డి అప్పల నాయుడు అక్కడకు వెళ్ళి వారి భౌతిక కాయాన్ని సందర్శించి పుష్పగుచ్ఛం ఉంచి శ్రద్ధాంజలి ఘటించారు. జీవిఎస్ఎన్ రాజు, ఇతర కుటుంబ సభ్యులను పరామర్శించి, ధైర్యంగా ఉండాలని సూచించారు. పలువురు పాత్రికేయులు కూడా మృతదేహాన్ని సందర్శించి, సీతారామరాజుకు ఘన నివాళులర్పించారు.

## ఏలూరు నుండి విజయవాడ నాన్‌స్టాప్ కొత్త అల్ట్రా డీలక్స్ సర్వీస్ ప్రారంభం..

**- జెండా ఊపి ప్రారంభించిన ఏలూరు ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య (చంటి), ఏపీఎస్ ఆర్టీసీ విజయవాడ జోనల్ చైర్మన్, ఏలూరు నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ రెడ్డి అప్పల నాయుడు**



**ఏలూరు, ఏప్రిల్ 16 (జనస్వరం) :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఏలూరు డిపో నుండి బుధవారం ఏలూరు నుండి విజయవాడ నాన్ స్టాప్ సర్వీస్ కొత్త ఆల్ట్రా డీలక్స్ సర్వీసును ఏలూరు ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య (చంటి), విజయవాడ జోనల్ 2 చైర్మన్ రెడ్డి అప్పలనాయుడి చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే బడేటి చంటి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత దాదాపు 12 కొత్త సర్వీసుల్ని కాకుండా అనేక కొత్త బస్సు ల్ని ప్రారంభించినట్లు తెలిపారు. ప్రతినిత్యం మా వద్దకు వచ్చే అనేకమంది ప్రజల విన్నపాలు మేరకు కొత్త బస్సులు ప్రారంభించి నట్లు తెలిపారు. ప్రజలకు సరికొత్త బస్సులు, సరికొత్త రూట్లలో, మరిన్ని బస్సులు ఏర్పాటు చేయడానికి మేము సిద్ధంగా ఉన్నా మని, జోనల్ చైర్మన్‌లను ఏర్పరిచిన తర్వాత ఆర్టీసీ సర్వీసులను మరింత మెరుగుపరిచి మంచి సేవలు అందిస్తున్నామని, భవిష్యత్తులో మరింత అభివృద్ధి బాటలో తీర్చిదిద్దుతామని చెప్పారు. ఆర్టీసీ జోనల్ చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి తాను జోనల్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత జోన్ మొత్తం పర్యటిస్తూ నిరంతర అభివృద్ధికి అధికారులతో సమీక్షిస్తూ మరిన్ని కొత్త బస్సులు తీసుకురావడానికి, కొత్త సర్వీసులు ఏర్పాటు చేయడానికి తన వంతుకృషి చేస్తున్నానని, ఒకప్పుడు బస్సులు తిరగడానికి కూడా వీలు లేని రోడ్లపై ఈ రోజున గుంతలు పూడ్చి బస్సులు నడవడానికి మరింత మెరుగైన చర్యలు తీసుకున్నామని, ఎమ్మెల్యేతో కలిసి మరిన్ని సౌకర్యాలు ప్రజలకు అందే విధంగా తన వంతుగా కృషి చేస్తానని తెలియజేశారు.. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ జి.మురళి, స్టేషన్ మేనేజర్ కుమారి, పిఆర్‌వో నరసింహం, అనేకమంది ఆర్టీసీ కార్మికులు, పలు ఆర్టీసీ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

## చంద్రబాబు జన్మదిన నిర్వహణకు "తెలుగు శక్తి" చురుకుగా ఏర్పాట్లు

**- రాష్ట్ర మంత్రులు ఆనం రామనారాయణ రెడ్డి, డోల బాల వీరాంజనేయ స్వామి, ఎమ్మెల్యే గంట శ్రీనివాసరావు చేతుల మీదుగా పోస్టర్ ఆవిష్కరణ**

**- సింహాచలం భూముల ఆక్రమణల వివరించిన "తెలుగు శక్తి" బి.వి.రామ్**



**విశాఖపట్నం, ఏప్రిల్ 16 (జనస్వరం) :** సీఎం చంద్రబాబు జన్మదినాన్ని ఘనంగా నిర్వహించేందుకు తెలుగు శక్తి చురుకుగా ముందుకు కదులుతోంది. ఈ నేపథ్యంలోనే బుధవారం గోశాల సమీపంలోని సింహాచలం సమావేశ మందిరంలో రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, విశాఖ జిల్లా ఇన్చార్జ్ మంత్రి డోల శ్రీ బాల వీరాంజనేయ స్వామి, ఎమ్మెల్యే గంట శ్రీనివాసరావు చేతుల మీదుగా.. చంద్రబాబు నాయుడు జన్మదిన పోస్టర్‌ను తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ ఆవిష్కరింపజేశారు.

**వైసీపీ అక్రమార్కుల చేతుల్లో సింహాచలం భూములు :**
ఈ సందర్భంగా దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డితో బి.వి.రామ్ మాట్లాడుతూ వైసీపీ అక్రమార్కుల చేతుల్లో సింహాచలం భూములు ఉన్నాయని ఫిర్యాదు చేశారు. పూసపాటి వంశీయులు వేలాది ఎకరాల భూమిని సింహాచలం దేవస్థానానికి అందజేశారన్నారు. అయితే వైసిపి అధికారంలోకి వచ్చిన తరువాత దేవస్థానం భూములు కబ్జాకు గురయన్నారు.

**ఎన్టీఆర్ జయంతిని అధికారికంగా నిర్వహించాలి :**
తెలుగు తేజం, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా పని చేసిన దివంగత నందమూరి తారక రామారావు జయంతిని ప్రభుత్వం అధికారిక కార్యక్రమంగా నిర్వహించాలన్నారు. అనంతరం దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి స్పందిస్తూ అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో పీతల అప్పారావు, కే.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ముఠాకక్షలకు దూరంగా ఉండండి : డీఎస్పీ



**పులివెందుల, ఏప్రిల్ 16 (జనస్వరం) :** ముఠా కక్షలకు దూరంగా ఉండాలని తొండూరు పోలీసులు ఇనగలూరులో మేలుకొలుపు కార్యక్రమాన్ని కళా జాతర రూపంలో నిర్వహించారు. వెపన్ కలిగి ఉంటే ఎప్పటికప్పుడు లైసెన్స్ రెన్యువల్ చేసుకోవాలని తెలిపారు. గ్రామంలో ఎలాంటి ఘర్షణ వాతావరణం లేకుండా జీవించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పులివెందుల డీఎస్పీ మురళి నాయక్, సీఐ. ఎన్ రమణ, సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

## పవన్ కళ్యాణ్ కుటుంబాన్ని లక్ష్యం చేసుకున్న విమర్శలు అప్రస్తుతమైనవి

**సర్వేపల్లి నియోజకవర్గ జనసేన సమన్వయకర్త బొబ్బేపల్లి సురేష్ నాయుడు**



**సర్వేపల్లి, ఏప్రిల్ 16 (జనస్వరం) :** డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సతీమణి అన్నా లెజినోవ తిరుమల శ్రీవారిని మొక్కుకుని తలనీలాలు ఇచ్చిన విషయం పట్ల సోషల్ మీడియాలో వస్తున్న అనవసర విమర్శలపై జనసేన పార్టీ నేతలు ఘాటుగా స్పందించారు. సర్వేపల్లి నియోజకవర్గ జనసేన సమన్వయకర్త బొబ్బేపల్లి సురేష్ నాయుడు, పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "విదేశీయురాలైన అన్నా లెజినోవ భారతీయ సాంప్రదాయాలను గౌరవించి, తన బిడ్డ ప్రాణాలను కాపాడిన దేవుడిగా భావించి శ్రీవారికి తలనీలాలు సమర్పించడం తప్పేంటి?" అని ప్రశ్నించారు. గత అయిదేళ్లుగా పవన్ కళ్యాణ్ కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకుని అసత్య ప్రచారాలు చేసిన పేటీఎం బ్యాచ్, ఇప్పుడు కూడా ఓ తల్లి తన బిడ్డ కోసం చేసిన మోక్షార్పణాన్ని విమర్శించడమేంటని ఆయన మండిపడ్డారు. "ఇలాంటివి చేసే వాళ్లకు చెప్పులు, దండలతో ఊరేగింపు తప్పదు," అని హెచ్చరించారు. మాజీ సీఎం జగన్ నాటి తప్పుడు ప్రవర్తనను గుర్తు చేస్తూ, "శ్రీవారి ప్రసాదం విషయంలో కూడా ఆయన కపట బుద్ధి ప్రదర్శించిన సంగతి అందరికీ తెలుసు," అని అన్నారు. ఈ సమావేశంలో ఏఎంసీ డైరెక్టర్ గుమ్మినేని వాణి భవాని నాయుడు, వెంకటాచలం మండల ప్రధాన కార్యదర్శి కాకి శివకుమార్, కార్యదర్శి సందూరి శ్రీహరి, చల్లా చెంచయ్య, మణి తదితరులు పాల్గొన్నారు.

## కందుకూరి వీరేశలింగం గొప్ప సంఘ సంస్కర్త

**డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి**




**పులివెందుల, ఏప్రిల్ 16 (జనస్వరం) :** స్వర్గీయ వీరేశలింగం పంతులు గొప్ప సంఘ సంస్కర్త, రచయిత, నవ్యాంధ్ర వైతాళికుడని రాజ్య సభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ ఎన్ తులసి రెడ్డి కొనియాడారు. స్వర్గీయ కందుకూరి జయంతిని కాంగ్రెస్ నాయకులు బుధవారం వేంపల్లిలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాహిత్యాన్ని శక్తివంతమైన ఆయుధంగా చేసుకుని బాల్య వివాహాలు, స్త్రీల పట్ల వివక్ష, అవిద్య, అవినీతి, సాంఘిక దురాచారాలను రూపుమాపుటకు కృషి చేసిన గొప్ప సంఘ సంస్కర్త అని శ్లాఘించారు. స్త్రీ విద్యను, వితంతు వివాహాలను ప్రోత్సహించారన్నారు. సంఘ సంస్కరణలతో పాటు తెలుగు భాష అభివృద్ధికి కృషి చేశారన్నారు. గద్య తిక్కనగా పేరు గాంచారని తెలిపారు. జయంతి కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు డాక్టర్ సుబ్రమణ్యం, రామకృష్ణ, అమర్ నాథ్ రెడ్డి, ఉత్తన్న, బద్రి, నాగరాజు, రమణ, వినయ్, వెంకటేష్, మాస్ తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర పునర్నిర్మాణానికి అండగా నిలవండి

(మొదటిపేజీ తరువాయి)






**2023-24 నాటికి వివిధ రంగాల వాటా :**
2023-24 నాటికి ఏపీ ఆదాయంలో వ్యవసాయ రంగం వాటా 34 శాతం ఉంటే, భారతదేశానికి 20 శాతం, తెలంగాణకు 15 శాతం ఉంది. ఏపీలో పరిశ్రమల రంగం వాటా 24 శాతం ఉంటే, భారతదేశంలో 26 శాతం, తెలంగాణలో 18 శాతం ఉంది. ఏపీలో సేవలరంగం వాటా 42 శాతం ఉంటే, భారతదేశంలో 54 శాతం, తెలంగాణలో 67 శాతం ఉంది.

**ప్రధాన ఆదాయ వనరు లేదు :**
ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి హైదరాబాద్ ప్రధాన ఆదాయ వనరుగా ఉండేది. రాష్ట్ర విభజనతో హైదరాబాద్ ఆదాయం ఏపీ కోల్పోయింది. దీంతో తెలంగాణకు ఆదాయంలో 75 శాతం హైదరాబాద్ నుంచే వస్తోంది. ఇది తెలంగాణ వృద్ధికి, తలసరి ఆదాయం పెరుగుదలకు, ఏపీ వెనకబాటు తనానికి కారణమైంది.

**గత ప్రభుత్వ హయాంలో కోలుకోలేని నష్టం :**
గత ప్రభుత్వ హయాంలో 2019 నుంచి 2024 వరకు ఐదేళ్ల నిర్లక్ష్యం కారణంగా రాష్ట్రానికి ఆర్థికంగా కోలుకోలేని దెబ్బ తగిలింది. 2014 - 2019 మధ్య 13.49 శాతం సరాసరి వృద్ధి వుంటే... 2019-2024 మధ్య సరాసరి వృద్ధి 10.32 శాతానికి పడిపోయింది.

**జీఎస్డీపీలో రాష్ట్ర సొంత ఆదాయం తక్కువ :**
దేశంలోని ముఖ్యమైన రాష్ట్రాలతో పోల్చుకుంటే జీఎస్డీపీలో రాష్ట్ర సొంత ఆదాయ వనరుల శాతం ఏపీలో తక్కువగా ఉంది. ఏపీలో 6.48 శాతం ఉంటే, తెలంగాణలో 9.51 శాతం, కేరళలో 8.49 శాతం, మహారాష్ట్రలో 7.93 శాతంగా ఉంది.

**విభజనతో నష్టం-పంపకాలు పెండింగ్ :**
విభజనతో జాతీయ సంస్థలు, విద్య-వైద్య సంస్థలు, భారత ప్రభుత్వ సంస్థలు ఏపీకి లేకుండా పోయాయి. విభజన చట్టం షెడ్యూల్ 9 ప్రకారం 91 ప్రభుత్వ కంపెనీలు, కార్పొరేషన్లకు సంబంధించి రూ.1.63 లక్షల కోట్లు, అలాగే షెడ్యూల్ 10 కింద ఉన్న 142 సంస్థలకు చెందిన రూ.39,191 ఆస్తుల పంపంకం అంశం రెండు రాష్ట్రాల మధ్య విభజన జరిగి పదేళ్లవుతున్నా ఇంకా పెండింగ్‌లోనే ఉంది.

**తలసరి ఆదాయంలోనూ తలకిందులు :**
రాష్ట్రం విడిపోయే నాటికి 2014-15లో ఏపీ తలసరి ఆదాయం రూ.93,903 ఉంటే, తెలంగాణ తలసరి ఆదాయం రూ.1,24,104గా ఉండేది. మొదటి ఐదేళ్ల మా పాలనలో ఏపీలో తలసరి ఆదాయం 13.21 శాతం పెరిగి 2019కి రూ.1,54,031కు చేరుకుంది. అదే కాలానికి తెలంగాణలో 13.37 శాతం పెరిగి రూ.2,09,848 అయ్యింది. 2019-24 మధ్య ఏపీలో తలసరి ఆదాయ వృద్ధి 9.18 శాతానికి పడిపోయింది. తెలంగాణలో మాత్రం 11.45 శాతం నమోదైంది. దీంతో 2023-24లో ఏపీ తలసరి ఆదాయం రూ.2,37,951, తెలంగాణ తలసరి ఆదాయం రూ.3,56,56 నమోదైంది. ఇలా రాష్ట్ర విభజన, గత ప్రభుత్వ విధ్వంసం కారణంగా తలసరి ఆదాయంలో తెలంగాణకు, ఏపీకి వ్యత్యాసం భారీగా పెరిగిపోయింది. దక్షిణ భారత రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ తలసరి ఆదాయమే అత్యంత తక్కువ.

**ఖచ్చితంగా చేయాల్సిన వ్యయమే ఎక్కువ :**
రాష్ట్రానికి సొంతంగా వచ్చే ఆదాయం కన్నా... వడ్డీ చెల్లింపులు, పెన్షన్లు, జీతాలు..ఇలా ఖచ్చితంగా ఖర్చు చేయాల్సిన వ్యయం ఎక్కువగా ఉంటోంది. 2023-24లో చూస్తే... మొత్తం ఖచ్చితంగా చేయాల్సిన వ్యయం రూ.1,0322 కోట్లు ఉంటే, సొంత ఆదాయం రూ.93,410 కోట్లు మాత్రమే ఉంది. అంటే ఆదాయం కన్నా, ఖచ్చితంగా చేయాల్సిన వ్యయం 110.6 శాతం ఎక్కువ ఉంది. ఇది రాష్ట్రానికి భారంగా మారింది.

**2019-24లో గాడితప్పిన వ్యవస్థ :**
గత ప్రభుత్వ హయాంలో ఆర్థిక క్రమశిక్షణ లేకపోవడం, ఆదాయ వృద్ధిపై దృష్టి పెట్టకపోవడం రాష్ట్రానికి భారీగా నష్టం కలిగించింది. రెవెన్యూ వ్యయంపై ఎలాంటి నియంత్రణ లేదు. 2024లో అధికారం చేపట్టేనాటికి మొత్తం రుణాలు రూ.9.74 లక్షల కోట్లకు ఉంది. దీనికి తోడు గత ప్రభుత్వం చెల్లించకుండా వదిలేసిన బకాయిలు రూ.1.35 లక్షల కోట్లు ఉన్నాయి. మూలధన వ్యయం కూడా 2014-19లో 2.01 శాతం నుంచి 2019-24కి 1.38 శాతానికి తగ్గింది.

**ఈ 9 నెలల్లో గాడిలో పెట్టాం :**
2024లో అధికారంలోకి రాగానే గత ప్రభుత్వం మిగిల్చిన రూ.24,811 కోట్ల బకాయిలు చెల్లించాల్సి వచ్చింది. కేంద్ర ప్రాయోజిక పథకాలకు సంబంధించిన బకాయిలు రూ.13,085 కోట్లు తీర్చాం. మూలధన వ్యయానికి సంబంధించి రూ.13,314 కోట్లు చెల్లించాం. స్థానిక సంస్థలను బలోపేతం చేసేందుకు రూ.3,339 కోట్లు ఖర్చు చేశాం. అమరావతి, పోలవరం, ఇండస్ట్రియల్ హబ్, పోర్టుల నిర్మాణం కోసం నిధులు భారీగా ఖర్చు పెడుతున్నాం.

**19 కొత్త పాలసీలు తీసుకువచ్చాం :**
రాష్ట్రాభివృద్ధి కోసం కొత్తగా 19 పాలసీలు ప్రవేశపెట్టాం. ఇండస్ట్రియల్ డెవలప్మెంట్ పాలసీ, ఫుడ్ ప్రాసెసింగ్ పాలసీ, ఎంఎస్ఎంఈ, మేరిటైమ్, క్లీన్ ఎనర్జీ, టూరిజం, ఎలక్ట్రానిక్స్ మ్యానుఫ్యాక్చరింగ్ పాలసీల ద్వారా పెద్దఎత్తున పెట్టుబడులు ఆకర్షించేందుకు ప్రయత్నిస్తున్నాం.

**స్వర్ణాంధ్ర సాకారానికి వృద్ధి రేటే ఆధారం :**
స్వర్ణాంధ్ర విజన్ -2047 సాకారం కావాలంటే వృద్ధి రేటు 15 శాతం ఉంటేనే సాధ్యమవుతుంది. 15 శాతం తగ్గకుండా వృద్ధి నమోదు చేయగలిగితే జీఎస్డీపీ రూ.347 లక్షల కోట్లకు చేరుతుంది. తలసరి ఆదాయం రూ.58,14,916కు పెరుగుతుంది. అదే 12.50 శాతం వృద్ధి నమోదైతే జీఎస్డీపీ రూ.214 లక్షల కోట్లు, తలసరి ఆదాయం రూ.35,85,473 అవుతుంది.

**ఏటా పెరుగుతున్న రెవెన్యూ లోటు :**
ప్రతీ ఏటా ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ లోటు పెరిగిపోతోంది. ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.1,28,146 కోట్లు ఉంటే, 2030-31 నాటికి రూ.1,43,640 కోట్లకు చేరుతుందని అంచనా వేస్తున్నాం.

**వర్టికల్ డెవల్యూషన్ వాటా పెంచాలి :**
వికసిత్ భారత్ సాధనలో రాష్ట్రాలు ముఖ్య పాత్ర పోషించాల్సి ఉంటుంది. దీనికి ఆర్థిక సంఘం వర్టికల్ డెవల్యూషన్ వాటా ప్రస్తుతం ఉన్న 41 శాతం నుంచి 50 శాతానికి పెంచాలి. అటు, హారిజెంటల్ డెవల్యూషన్‌లోనూ దక్షిణాది రాష్ట్రాల వాటా తగ్గిపోతోంది. 10వ ఆర్థిక సంఘం సమయంలో దక్షిణాది రాష్ట్రాలకు హారిజెంటల్ డెవల్యూషన్ 24.30 శాతం ఉంటే, 15వ ఆర్థిక సంఘానికి వచ్చే సరికి 15.80 శాతానికి తగ్గింది. హారిజెంటల్ డెవల్యూషన్‌లో ఏపీ వాటా పరిశీలిస్తే... దేశ జీడీపీ, జాతీయ జనాభా వాటా కన్నా తక్కువగా ఉంది. ఇది ఆర్థికంగా ఏపీకి నష్టం కలిగిస్తోంది.

**గ్రామీణ స్థానిక సంస్థలకు గ్రాంట్లు :**
రాష్ట్రాల్లో గ్రామీణ స్థానిక సంస్థలకు గ్రాంట్లు కేటాయించేటప్పుడు 70 శాతం వెయిటేజీ జనాభాకు, 20 శాతం వెయిటేజీ వ్యవసాయం, అనుబంధ రంగాలకు 10 శాతం వెయిటేజీ ప్రాంతానికి ఇవ్వాలని ప్రతిపాదన. గ్రామ పంచాయతీలు, మండల ప్రజా పరిషత్‌లు, జిల్లా పరిషత్‌లకు రూ.69,897 కోట్ల నిధులు అవసరం కాగా, రూ.7,381 కోట్లు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. మరో రూ.62,516 కోట్ల నిధులు కావాల్సి ఉంది.

**పట్టణ స్థానిక సంస్థలకు గ్రాంట్లు :**
పట్టణ, స్థానిక సంస్థల్లో తాగునీటి సరఫరా, పారిశుధ్యం, రహదారుల నిర్మాణం, అర్బన్ ట్రాన్స్‌పోర్ట్, వీధి లైట్లు, మురుగునీటి పారుదల వ్యవస్థల కోసం రూ.19,871 కోట్ల గ్రాంట్లు అవసరం అవుతుంది. అలాగే 2026-2031 మధ్య కాలానికి ప్రకృతి విపత్తులను ఎదుర్కొనేందుకు రూ.16,181 కోట్లు కావాల్సి ఉంది.

**ఏపీ ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీ :**
క్లీన్ ఎనర్జీకి రాష్ట్రంలో అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నాం. ఆంధ్రప్రదేశ్‌ను గ్రీన్ హైడ్రోజన్ హబ్‌గా తీర్చిదిద్దాలని అనుకుంటున్నాం. 2030 నాటికి 160 గిగావాట్ల పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తి లక్ష్యం. దీనికి రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులు అవసరం ఉంది. 7.5 లక్షల ఉద్యోగాల కల్పన జరుగుతుంది.

**అమరావతికి రూ.47,000 కోట్లు అవసరం :**
రాజధాని అమరావతిలో మౌలిక సదుపాయాలు, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు రూ.77,249 కోట్లు అవసరం కాగా... వరల్డ్ బ్యాంక్, హడ్కో, కేఎఫ్‌డబ్ల్యూ డెవలప్మెంట్ బ్యాంక్ ద్వారా ఫండింగ్ రూ.31,000 కోట్లు సమకూరాయి. ఇంకా కావాల్సిన నిధులు రూ.47,000 కోట్లు

**ఇవీ ఆంధ్రప్రదేశ్ అవసరాలు :**
1. పోలవరం-బనకచర్ల అనుసంధానం
2. తాగునీటి ప్రాజెక్టులు
3. 5 పర్యాటక హబ్‌లు(అమరావతి, విశాఖపట్నం, అరకు, తిరుపతి, రాజమహేంద్రవరం) ఐఐటీ తిరుపతిలో ఇంక్యుబేషన్ సెంటర్, బుద్ధిస్ట్ సర్క్యూట్, అమరావతిలో జాతీయ మ్యూజియం, విశాఖపట్నంలో వరల్డ్ క్లాస్ కన్వెన్షన్ సెంటర్ ఏర్పాటు
4. నాలెడ్జ్ ఎకానమీలో భాగమైన క్వాంటమ్ వ్యాలీ ప్రాజెక్టు, స్కిల్ డెవలప్మెంట్, రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్, 100 శాతం అక్షరాస్యత
5. పోర్టులు, ఫిషింగ్ హార్బర్లు, మల్టీ మోడల్ లాజిస్టిక్ పార్కులు, గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్టులు, ఇన్‌ల్యాండ్ వాటర్ వేలు, రహదారులు
6. అమరావతి, విశాఖపట్నం, తిరుపతి రీజనల్ గ్రోత్ సెంటర్లు...

ఈ ప్రాజెక్టులు చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వానికి గ్రాంట్లు ఇచ్చేలా సిఫారసులు చేయాలని ఆర్థిక సంఘాన్ని ముఖ్యమంత్రి కోరారు.

# ఉచ్చులో చిక్కి చిరుత మృతి

- నడుముకు ఉచ్చు బిగుసుకుపోవడంతో.. గ్రామస్థులు, అటవీశాఖ అధికారుల కళ్లెదుటే మృతి
- చిరుత గర్భంలోనే రెండు కూనలూ కన్నుమూత



**మదనపల్లె టౌన్, ఏప్రిల్ 16 (జనస్వరం) :** నిండు గర్భంతో ఉన్న చిరుతపులి వేటగాళ్ల ఉచ్చులో చిక్కి విలవిల్లాడింది. భీకరంగా అరుస్తూ పది గంటలపాటు నరకయాతన అనుభవించింది. నడుముకు ఉచ్చు బిగుసుకుపోవడంతో ఊపిరాడక కొట్టుమిట్టాడింది. చివరకు శరీరంలోని శక్తి సన్నగిల్లి, ఎండకు సొమ్మసిల్లి.. అటవీశాఖ అధికారులు, గ్రామస్థులు కళ్లెదుటే ప్రాణాలు విడిచింది. దీంతో దాని కడుపులో ఉన్న రెండు పిల్లలు కూడా కన్నుమూశాయి. అన్నమయ్య జిల్లా మదనపల్లె మండలంలో బుధవారం ఈ సంఘటన చోటుచేసుకుంది. మదనపల్లె మండలం పొన్నేటి గ్రామం సమీపంలో బుధవారం తెల్లవారుజామున పులి అరుపులు విన్న కొందరు గ్రామస్తులు అటువెళ్లి చూడగా.. వేటగాళ్ల ఉచ్చులో చిక్కి గిలగిలా కొట్టుకుంటున్న చిరుత కనిపించింది. దీంతో ఉదయం 8 గంటలకు వారు అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. సబ్ డీఎఫవో శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఎఫ్ఆర్వో జయప్రసాదరావు, డీఆర్వో మదనమోహన్ సంఘటనా స్థలానికి వచ్చి చిరుతను పరిశీలించారు. దాన్ని బంధించడానికి అటవీశాఖ వద్ద వలలు లేకపోవడంతో వాలీబాల్ నెట్‌లు తీసుకొచ్చారు. చిరుతకు మత్తు ఇంజెక్షన్ ఇచ్చేందుకు అటవీశాఖ ఉన్నతాధికారుల ఆదేశాల కోసం గంట పాటు ఎదురుచూసారు. తీరా అనుమతి వచ్చాక తుపాకిలో ఇంజెక్షన్ పెట్టి పేల్చగా అవి పేలలేదు. దీంతో తిరుపతి జూపార్కు నుంచి ట్వాంకిలైజర్స్ గన్‌లు తీసుకురావాలని పై అధికారులను కోరారు. ఈలోగా గ్రామస్తులు చిరుతను కాపాడేందుకు ప్రయత్నించగా అటవీశాఖ అధికారులు అడ్డుకున్నారు. సొమ్మసిల్లిన చిరుతకు తాగునీరు అందించడానికి కూడా నిరాకరించారు. చివరకు మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో చిరుత సొమ్మసిల్లి అచేతనంగా పడిపోయింది. అధికారులు దగ్గరకు వెళ్లి చూడగా అది మృతిచెందింది.

**చిరుత కడుపులో పిల్లలు :**
ఆరేళ్ల వయసున్న ఈ ఆడ చిరుత గర్భంతో ఉన్నట్లు పశువైద్యాధికారులు డాక్టర్ ప్రసాదరెడ్డి, లారెన్స్ స్థానిక పశువైద్యశాలలో నిర్వహించిన పోస్టుమార్టంలో బయటపడింది. చిరుత కడుపులో రెండు మగ పిల్లలు కనిపించాయి. మరో 20 రోజుల్లో తల్లి గర్భం నుంచి బయట పడేవని డాక్టర్ రోహిణి వెల్లడించారు. చిరుత కళేబరంతో పాటు, దాని పిల్లలను కూడా అధికారులు దహనం చేశారు.

## బీటీ రోడ్ల నిర్మాణ పనులు ప్రారంభించిన తిరుపతి రెడ్డి



**బొంరాస్‌పేట, ఏప్రిల్ 16 (జనస్వరం) :** కొడంగల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ తిరుపతి రెడ్డి బుధవారం మండల పరిధిలోని పలు బీటి రోడ్డు నిర్మాణ పనులను వికారాబాద్ జిల్లా గ్రంధాలయ చైర్మన్ రాజేష్ రెడ్డి, కాడ ప్రత్యేక అధికారి వెంకటరెడ్డితో కలిసి తిరుపతి రెడ్డి భూమి పూజ నిర్వహించి పనులను ప్రారంభించారు. హైదరాబాద్- బీజాపూర్ 163వ జాతీయ రహదారి నుండి మెట్లకుంట మీదుగా బొంరాస్‌పేట వరకు సిఆర్ఆర్ నిధుల ద్వారా రూ.4 కోట్ల 20 లక్షలు, మెట్లకుంట నుండి లోతుకుంటతండా వరకు రూ.రెండు కోట్ల 15 లక్షలు, లోతుకుంటతండా నుండి గుబ్బడితండా వరకు ఎస్డిఆర్ నిధుల ద్వారా రూ.ఐదు కోట్ల 57 లక్షలు, బొంరాస్‌పేట నుండి బురాన్ పూర్, మదన్‌పల్లి మీదుగా నాగారం వరకు రూ.22 కోట్ల 18 లక్షలు, ఏర్పుమళ్ళ నుండి బుద్లాపూర్ వరకు సింగిల్ రోడ్డు రూ.4 కోట్ల 37 లక్షలు, నాందార్ పూర్ నుండి ఏర్పుమళ్ళ వరకు డబుల్ రోడ్డు రూ.కోటి 62 లక్షలు, 163వ జాతీయ రహదారి నుండి చౌదర్ పల్లి వరకు రూ.7 కోట్ల 2 లక్షలు, 163వ జాతీయ రహదారి నుండి బొంరాస్‌పేట వరకు నాలుగు వరుసల రోడ్డు కోసం రూ.17 కోట్లు మంజురయ్యాయి. ఈ కార్యక్రమంలో అధికారులు కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులున్నారు.

## పలు పాఠశాలలను తనిఖీ చేసిన ఎంపీడీఓ



**బొంరాస్‌పేట, ఏప్రిల్ 16 (జనస్వరం) :** మండల పరిధిలోని నాందార్ పూర్, లింగన్ పల్లి పాఠశాలలను ఎంపీడీఓ వెంకన్ గౌడ్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. తనిఖీల్లో భాగంగా లింగన్ పల్లి పాఠశాలలో మధ్యాహ్నం భోజనానికి వినియోగించే బియ్యం నిల్వలను పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలన్నారు. పలు రకాల రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం అంగన్వాడి కేంద్రాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీహరి, ఉపాధ్యాయులు అమూల్య, నరేష్ తదితరులు ఉన్నారు.

## ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలి : ఎంఈఓ




**బొంరాస్‌పేట, ఏప్రిల్ 16 (జనస్వరం) :** మండల పరిధిలోని బురాన్పూర్ పాఠశాలను మండల విద్యాధికారి హరిలాల్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజన వంటగదిలో నిత్యవసర సరుకులను పరిశీలించి ఎప్పటికప్పుడు పాత్రలను శుభ్రంగా ఉంచుకోవాలని నాణ్యత ప్రమాణాలతో కూడిన భోజనాన్ని విద్యార్థులకు అందించాలని ఆదేశించారు. అనంతరం అదనపు తరగతి గదుల నిర్మాణ పనులను పరిశీలించి, వార్షిక పరీక్షల నిర్వహణ తీరును పరిశీలించారు. అనంతరం ఎస్ఏ 2 వార్షిక ఫలితాలను ఎప్పటికప్పుడు పేపర్ వాల్యువేషన్ చేసి ఆన్లైన్లో నమోదు చేయాలని ఆదేశించారు ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఆర్పి సోమ్లా నాయక్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## లావణ్య ఇంటి వద్ద రాజ్‌తరుణ్ తల్లిదండ్రులు



**నార్సింగి, ఏప్రిల్ 16 (జనస్వరం) :** సినీనటుడు రాజ్ తరుణ్ తల్లిదండ్రులు కోకాపేటలోని లావణ్య ఉంటున్న ఇంటికి వెళ్లడంతో వివాదం చోటుచేసుకుంది. సూరారంలో ఉంటున్న రాజ్ తరుణ్ తల్లిదండ్రులు బస్వరాజ్, రాజేశ్వరి అద్దింట్లో ఇబ్బంది అవుతోందని తమ కొడుకు ఇంట్లో ఉంటామని బుధవారం కోకాపేటకు వచ్చారు. ఇంట్లోకి వెళ్లడానికి వారు ప్రయత్నించడంతో లావణ్య అడ్డుకుంది. కోర్టులో కేసులున్నాయని, పోలీసులతో మాట్లాడిన తరువాత ఇంట్లోకి రావాలని ఆమె అడ్డుకుంది. తనపై దాడికి వచ్చారని లావణ్య ఆరోపించారు. దీంతో వారు సాయంత్రం వరకు అక్కడే కూర్చున్నారు. దీనిపై నార్సింగి అడ్మిన్ ఎస్ఐ సుఖేందర్‌రెడ్డిని వివరణ కోరగా.. తమకు ఎవరి నుంచి ఫిర్యాదు రాలేదని చెప్పారు.

## ఈతకు వెళ్లి విద్యార్థిని మృతి



**పులివెందుల, ఏప్రిల్ 16 (జనస్వరం) :** వైఎస్సార్ కడప జిల్లా అట్లూరు మండలం కమలకురులో ఈతకు వెళ్లి 15 ఏళ్ల తేజ అను విద్యార్థిని మృతి చెందిన విషయం తెలిసిందే. తేజ నడుముకు కట్టుకున్న ప్లాస్టిక్ వస్తువు జారిపోవడంతో నీటిలో కొట్టుకుపోయినట్లు స్థానికులు తెలిపారు. బాలిక తండ్రి జీవనోపాధి కోసం కువైట్‌కు వెళ్లారు. పాప మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

## వక్ఫ్ ఆస్తుల పరిరక్షణకు చంద్రబాబు కృషి : టీడీపీ



**పులివెందుల, ఏప్రిల్ 16 (జనస్వరం) :** వక్ఫ్ చట్ట సవరణ బిల్లుపై సీఎం చంద్రబాబు స్పష్టమైన ఆలోచనతో పాటు వక్ఫ్ బోర్డు ఆస్తుల పరిరక్షణకు కృషి చేస్తున్నట్లు టీడీపీ సీనియర్ నేత, మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మహమ్మద్ షబ్బీర్ అన్నారు. బుధవారం ఆయన వేంపల్లిలో విలేకరులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో ముస్లింల రక్షణ, అభ్యున్నతికి టీడీపీ కట్టుబడి ఉందన్నారు. ముస్లింలా మనోభావాలు దెబ్బ తినకుండా పార్టీ ఆవిర్భావం నుంచి కృషి చేస్తుందన్నారు. రాజకీయాలను అతీతంగా అధికారంలో ఉన్న లేకున్నా ముస్లింల పక్షాన నిలబడి అభ్యున్నతికి పని చేస్తూ వస్తుందన్నారు. దేశంలోని ఏ ప్రభుత్వం, ఏ పార్టీ తీసుకుని విధంగా వక్ఫ్ చట్ట సవరణ బిల్లులో మూడు ప్రతిపాదనలు పెట్టిన విషయాన్ని గుర్తు చేశారు. అయితే ముస్లింల పక్షపాతి అంటూ గొప్పలు చెప్పుకుంటున్న వైసీపీ అధినేత జగన్ వక్ఫ్ చట్ట సవరణ బిల్లుపై ఎందుకు ప్రతిపాదనలు చేయలేదని ప్రశ్నించారు. అలాగే రాష్ట్ర ప్రయోజనాల దృష్ట్యా కేంద్రంలోని ఎన్డీఏ కూటమి ప్రభుత్వంలో ఉన్న చంద్రబాబు వక్ఫ్ చట్ట సవరణ బిల్లుకు నిజాయితీగా మద్దతు తెలిపారన్నారు. కానీ వైసీపీ దొంగ వైఖరి మాదిరిగా కాదన్నారు. లోక్‌సభలో మద్దతు తెలపలేదన్న వైసీపీ, మరి రాజ్యసభలో ఎందుకు వక్ఫ్ చట్ట సవరణ బిల్లుకు మద్దతుగా నిలిచిందో తెలపాలని కోరారు. నిజంగా ముస్లింలపై జగన్ కు ప్రేమ ఉంటే ఇలా ఎందుకు చేశారో చెప్పాలన్నారు. దీంతో జగన్‌కు ముస్లింలపై చిత్తశుద్ధి లేదన్న విషయం తెలిసిందన్నారు. ఇప్పటికైనా వైసీపీ నాయకులు చంద్రబాబు ప్రభుత్వంపై బురద జల్లే ప్రయత్నాలు మానుకుంటే మంచిదని హితవు పలికారు.

## మేడా రామలక్షుమ్మ నేత్రదానం



**పులివెందుల, ఏప్రిల్ 16 (జనస్వరం) :** పట్టణంలోని అంకాలమ్మ పేటకి చెందిన మేడా రామలక్షుమ్మ (86) మరణించడంతో ఆమె కుమారులు లక్ష్మీనారాయణ, రాజేంద్ర ప్రసాద్, కుమార్తె లీలావతి, రాజేశ్వరి, రమాదేవి, కోడళ్ళు సుజాత, తులసిలు నేత్ర దానానికి అంగీకరిస్తూ జిల్లా అంధత్వ నివారణ సంస్థ, స్నేహిత అమృత హస్తం సేవాసమితి అధ్యక్షులు రాజులకు సమాచారం ఇవ్వడంతో టెక్నీషియన్ హరీష్‌తో కలిసి మృతురాలి నివాసంలో పార్థివ దేహం నుండి కార్నియాలను సేకరించి హైదరాబాద్‌లోని డాక్టర్ అగర్వాల్ నేత్రనిధికి పంపారు. ఈ సందర్భంగా స్నేహిత అమృత హస్తం సేవాసమితి అధ్యక్షులు రాజు మాట్లాడుతూ మనిషి మరణానంతరం మట్టిలో కలిసిపోయే నేత్రాలు దానం చేసేందుకు ప్రతి కుటుంబం ముందుకు రావాలని, కుటుంబంలోని వ్యక్తి లేదా సన్నిహితులు మరణించిన కుటుంబ సభ్యులు నేత్రదానంపై అవగాహన కలిగి నేత్రదానం చేయడం ద్వారా అంధత్వంతో బాధ పడుతున్న ఇద్దరు అంధులకు చూపు ఇచ్చే బృహత్కార్యం కోసం నేత్రదానం చేయదలచుకున్న వారు 7093204537 లేదా 9966500364లకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా నేత్రదానానికి అంగీకరించిన కుటుంబ సభ్యులకు బంధువులు, సన్నిహితులు, సేవాసమితి బృందం కృతజ్ఞత అభినందనలు తెలిపారు.

## విజయవంతంగా పల్లెపండుగ...ప్రగతిపథంలో పల్లెలు

- **కట్టుబడిపాలెంలో రూ.20.50 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణం**
- **ప్రారంభించిన శాసనసభ్యులు కృష్ణప్రసాద్**





**ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 16 (జనస్వరం) :** మైలవరం నియోజకవర్గంలో పల్లె పండుగ కార్యక్రమం విజయవంతంగా జరుగుతోంది. పల్లెలు ప్రగతిబాట పడుతున్నాయి. మౌలిక వసతుల కల్పనతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. జి.కొండూరు మండలంలోని కట్టుబడిపాలెం గ్రామంలో రూ.20.50 లక్షల ఎన్ఆర్ఈజిఎస్ నిధులు వెచ్చించి 320 మీటర్ల పొడవునా నిర్మించిన సీసీ రోడ్లను ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్, మైలవరం నియోజకవర్గ జనసేన పార్టీ ఇంఛార్జి అక్కల రామ్మోహనరావు (గాంధీ) బుధవారం ఉదయం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కృష్ణప్రసాద్ మాట్లాడుతూ కట్టుబడిపాలెంలో ఇళ్లస్థలాల సమస్యను కూడా పరిష్కరిస్తామన్నారు. ఇటు అభివృద్ధితో పాటు అటు సంక్షేమానికి సమాన ప్రాధాన్యత ఇస్తూ కూటమి ప్రభుత్వం పరిపాలన కొనసాగిస్తుందన్నారు. మే నెలలో తల్లికి వందనం పథకం అమలు చేస్తామన్నారు. ఇప్పటికే పింఛన్ల పెంపు, ఏడాదికి 3 ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకాలు అమలు చేస్తున్నామన్నారు. సీఎంఆర్ఎఫ్ సాయం కూడా వెంటనే రికార్డు స్థాయిలో మంజూరు చేస్తున్నట్లు వెల్లడించారు. పి 4 విధానంతో పేదరికం నిర్మూలనకు కృషి చేస్తున్నట్లు వెల్లడించారు. పరిశ్రమలో ఏర్పాటుతో ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు వెల్లడించారు. ముఖ్యంగా రాజధాని అమరావతి అభివృద్ధితో మన ప్రాంతం అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. ప్రజల జీవన ప్రమాణాలు పెంపొందించడానికి ప్రభుత్వం అన్ని చర్యలు చేపట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్డీఏ కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# రహదారుల అభివృద్ధికి కేంద్రం నుంచి నిధులు రాబడతా

**ఎంపీ పుట్టా మహేష్ కుమార్ వెల్లడి**



**దెందులూరు, ఏప్రిల్ 16 (జనస్వరం) :** ఏలూరు పార్లమెంటు నియోజకవర్గం పరిధిలోని రహదారుల అభివృద్ధికి అవసరమైన నిధులు కేంద్రం నుంచి రాబడతానని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ స్పష్టం చేశారు. దెందులూరు మండలం సోమవరప్పాడులో రూ.74 లక్షలతో నిర్మించిన బీటీ రోడ్డు, సిమెంటు రోడ్డును, ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌తో కలిసి ఎంపీ పుట్టా మహేష్ కుమార్ బుధవారం ప్రారంభించారు. తొలుత సోమవరప్పాడు ప్రధాన కూడలి వద్ద మాజీ ముఖ్యమంత్రి, దివంగత నందమూరి తారకరామారావు విగ్రహానికి ఎంపీ మహేష్ కుమార్, ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. తమ గ్రామంలో రహదారి అభివృద్ధికి కృషి చేసిన ఎంపీ పుట్టా మహేష్ కుమార్, ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌కు సోమవారప్పాడు ప్రజలు ఘన స్వాగతం పలికారు. ఎంపీ మహేష్ కుమార్, ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌పై పూలవర్షం కురిపించి తమ అభిమానం చాటుకున్నారు. అనంతరం పెదవేగి మండలం గోపన్నపాలెం నుండి రామసింగవరం వరకు రూ.3 కోట్లతో నిర్మిస్తున్న రహదారి అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ తో కలిసి ఎంపీ పుట్టా మహేష్ కుమార్ శంకుస్థాపన శిలాఫలకం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపీ మహేష్ కుమార్ మీడియా సమావేశంలో మాట్లాడుతూ దెందులూరు నియోజకవర్గం పరిధిలోని సమస్యలను తాను, ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. అభివృద్ధి అంటేనే ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అని, ప్రజలకు తన వంతు సేవలు అందిస్తున్నారని ఎంపీ పేర్కొన్నారు. గత వైసీపీ ప్రభుత్వం రహదారుల అభివృద్ధిని విస్మరించడంతో ఐదేళ్లపాటు ప్రజలు నరకం చవి చూశారని ఎంపీ తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రహదారుల అభివృద్ధిపై దృష్టి పెట్టిందని, ఫలితంగానే పల్లెల నుంచి పట్టణాల వరకు రహదారులు నూతన శోభను సంతరించుకుంటున్నాయని ఎంపీ వెల్లడించారు. మిగిలిన రహదారులను కూడా రానున్న రోజుల్లో అభివృద్ధి చేస్తామని ప్రజలకు హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ సోమవరప్పాడు రహదారిని రూ.74 లక్షలతో అభివృద్ధి చేయటం జరిగిందని, అలాగే గోపన్నపాలెం నుంచి రామసింగవరం వరకు రూ.3 కోట్లతో అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. ఎంపీ మహేష్ కుమార్ సహకారంతో దెందులూరు నియోజకవర్గం సమగ్ర అభివృద్ధికి తనవంతు కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే ప్రభాకర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ గారపాటి రామసీత, నాయకులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## అక్రమంగా ముందస్తు అడ్మిషన్లు నిర్వహిస్తున్న విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి



**నంద్యాల, ఏప్రిల్ 16 (జనస్వరం) :** జిల్లా వ్యాప్తంగా అక్రమంగా ముందస్తు అడ్మిషన్లు నిర్వహిస్తున్న కార్పొరేట్ ప్రైవేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షులు ఎస్.ఎండి రఫీ డిమాండ్ చేశారు. బుధవారం పీడీఎస్‌యూ కార్యాలయంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రఫీ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్త ఉన్న కార్పొరేట్ విద్యా సంస్థలు కొన్ని ప్రైవేటు విద్యా సంస్థలు విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందే ముందస్తు అడ్మిషన్లు ప్రారంభించారన్నారు. కార్పొరేట్ సంస్థల వారు బహిరంగంగా కరపత్రాలు, ఫ్లెక్సీలు వేసి అడ్మిషన్ల కొరకు ఎలక్షన్ ప్రచారం రీతిలో కార్పొరేట్ విద్యా సంస్థలు ముందస్తు అడ్మిషన్లు నిర్వహిస్తున్నారని ఆరోపించారు. ఒలంపియాడ్, ఇంటర్నేషనల్ స్కూల్, అని ప్రచారం నిర్వహిస్తూ ఐఐటీ ట్రిబుల్ ఐటీ ఫౌండేషన్ లాంటి కోర్సులు ఎల్కేజీ నుండే ప్రారంభిస్తున్నామని తల్లిదండ్రులకు మాయమాటలు చెప్పి ప్రజలను దోచుకుంటున్నారని విమర్శించారు. ఆర్థికమే ధ్యేయంగా పుట్టగొడుగుల పుట్టుకొస్తున్నటువంటి ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలలు రాష్ట్ర వ్యాప్తంగా సరైనటువంటి అనుమతులు లేకుండా నిర్వహిస్తున్నప్పటికీ విద్యాశాఖ అధికారులు నిర్లక్ష్యం వహించి, చర్యలు తీసుకోకపోవడం దారుణమన్నారు. కార్పొరేట్ విద్యాసంస్థలు విద్యా సంవత్సరం ఇంకా ప్రారంభం కాకముందే ముందస్తు అక్రమ అడ్మిషన్ ఫీజులతో పాటు, స్పెషల్ ఫీజు, పుస్తకాల ఫీజులని విద్యార్థుల తల్లిదండ్రులను దోపిడీ చేస్తున్నారని ఆరోపించారు. ముందస్తు అడ్మిషన్లు నిర్వహిస్తున్న పాఠశాలలపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షులు షైక్.షాహీద్, జిల్లా నాయకులు మధు కిరణ్, బాలాజీ, వినోద్, కిరణ్, నాయక్, రవి తదితరులు పాల్గొన్నారు.

## గిన్నిస్ బుక్‌లో చోటు సంపాదించిన కుక్కునూరు బాలుడు



**కుక్కునూరు, ఏప్రిల్ 16 (జనస్వరం) :** మండలంలోని పెదరావిగూడెం పంచాయతీ పరిధిలోని వెంకటాపురం గ్రామానికి చెందిన మోక్షిత్ రిషి నిహార్ గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్‌లో తన పేరును నమోదు చేసుకొని తన ప్రతిభను ప్రపంచానికి చాటించాడు. శెట్టి గోపి, మేరీ గ్రేస్ దంపతుల కుమారుడైన మోక్షిత్ రిషి నిహార్ గత ఆరు నెలలుగా అగస్టీన్ దండంగి సారథ్యంలో కీబోర్డ్ సంగీత విద్యలో మెలకువలు నేర్చుకున్నాడు. ఈ కాలంలో ప్రపంచంలోని 18 దేశాల సంగీత విద్వాంసులతో కలిసి ఒకేసారి సంగీతం ప్లే చేసే ప్రత్యేక కార్యక్రమంలో పాల్గొని గిన్నిస్ వరల్డ్ రికార్డ్ కోసం అర్హత సాధించాడు. గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ సంస్థ అధికారికంగా రికార్డ్‌ను గుర్తించి, మోక్షిత్ పేరు నమోదు చేసింది. ఈ గొప్ప విజయంతో మోక్షిత్ రిషి నిహార్ పలువురు ప్రముఖుల ప్రశంసలను అందుకుంటూ, తన కుటుంబం, గ్రామం, జిల్లా పేరు మరింత ప్రఖ్యాతిచెందేలా చేశాడు. ఈ అద్భుతమైన సాధనతో ఏజెన్సీ ప్రాంతానికి చెందిన విద్యార్థుల్లో సరికొత్త ఆశలు, లక్ష్యాలు రగిలించనున్నదని పెద్దల అభిప్రాయం.

## బహిరంగ ప్రదేశాలలో చెత్త వేస్తే కఠిన చర్యలు

**చింతపల్లి సర్పంచ్ దురియా పుష్పలత**



**చింతపల్లి, ఏప్రిల్ 16 (జనస్వరం) :** బహిరంగ ప్రదేశాలలో చెత్త వేస్తే ఉపేక్షించేది లేదని చింతపల్లి మేజర్ పంచాయతీ పరిధిలో పరిశుభ్రతకు అత్యున్నత ప్రాధాన్యతనిస్తున్నామని సర్పంచ్ దురియా పుష్పలత అన్నారు. ఈనెల 24 నుంచి 27 వరకు నిర్వహించబోయే గ్రామ దేవత ముత్యాలమ్మ జాతరను దృష్టిలో పెట్టుకొని గ్రామ పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేకంగా దృష్టి సారించామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఎక్కడపడితే అక్కడ చెత్తను పారవేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు బాధ్యతతో వ్యవహరించి, పంచాయతీ ఏర్పాటు చేసిన చెత్త కుండీలను తప్పనిసరిగా వినియోగించాలని సూచించారు. రహదారులకు ఇరువైపులా ఉన్న డ్రైనేజీలలో చెత్తను వేయరాదని, డ్రైనేజీలకు ఆనుకొని వ్యాపారం చేస్తున్న దుకాణదారులు ఈ విషయాన్ని ఖచ్చితంగా గమనించాలన్నారు. జాతర సందర్భంగా ఇతర ప్రాంతాల నుంచి వచ్చే తాత్కాలిక వ్యాపారులు కూడా తమ వ్యర్థాలను చెత్త కుండీల్లోనే వేయాలని, నిబంధనలు పాటించని వారిపై తగిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ప్రతి వ్యాపారి తన దుకాణం వద్ద చెత్త బుట్టను ఏర్పాటు చేయడం తప్పనిసరని స్పష్టంచేశారు. నిర్లక్ష్యంగా చెత్తను పారేస్తే జరిమానాలు విధిస్తామని, అలాగే ఇష్టానుసారంగా చెత్త వేయడం గమనించినవారు వారి ఫోటోలు తీసి పంచాయతీకి సమాచారం అందిస్తే వారికి నగదు బహుమతి అందిస్తామని చెప్పారు. పండుగ సమయంలో గ్రామ పరిశుభ్రతపై ప్రతి ఒక్కరు ప్రత్యేక శ్రద్ధ వహించి, స్వచ్ఛమైన చింతపల్లిగా మార్చేందుకు సహకరించాలని ఆమె పిలుపునిచ్చారు. వ్యాపారులు, ప్రజలు అందరూ తమ వంతు బాధ్యతగా చెత్త కుండీలను వినియోగించి, గ్రామ పరిశుభ్రతకు తోడ్పడాలని కోరారు.

## ఛార్జ్ షీట్ బనాయించడం అప్రజాస్వామికం

- **ప్రతిపక్షాలను నిర్వీర్యం చేయడమే బీజేపీ లక్ష్యం**
- **కేసులన్నీ బీజేపీ కల్పితాలు**
- **అంబేద్కర్ బొమ్మ వద్ద నల్ల జెండాలతో నిరసనలు, రోడ్లు దిగ్బంధం**
- **సిటీ కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు కే సంజయ్ కుమార్**



**నెల్లూరు, ఏప్రిల్ 16 (జనస్వరం) :** రాహుల్, సోనియాలపై బనాయించిన అక్రమ కేసులు, ఛార్జ్ సీటు వెంటనే ఎత్తివేయాలని నెల్లూరు సిటీ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు కే సంజయ్ కుమార్ డిమాండ్ చేశారు. సిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు నారపరెడ్డి కిరణ్ కుమార్ రెడ్డి ఆదేశాల మేరకు కాంగ్రెస్ శ్రేణులు చార్జి సీటుకు వ్యతిరేకంగా, అంబేద్కర్ బొమ్మ వద్ద నల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. అనంతరం రోడ్డు దిగ్బంధం చేశారు. స్వాతంత్ర ఉద్యమంలో అందర్నీ భాగస్వాములు చేసేందుకు నేషనల్ హెరాల్డ్ పత్రిక ప్రారంభించిన జవహర్లాల్ నెహ్రూ పటేల్ గాంధీజీ, కాంగ్రెస్ కుటుంబాలు ఏర్పాటు చేస్తే, ఆ పత్రిక కుంటుపడే విధంగా కుట్రలు చేసి దాని ఆస్తులను 13 సంవత్సరాల తర్వాత ఈడి అటాచ్మెంట్ చేస్తానని చెప్పడం హాస్యాస్పదంగా ఉందని సంజయ్ అన్నారు. బీజేపీ ప్రశ్నించిన ప్రతిపక్ష పార్టీలను నిర్వీర్యం చేయడం, నాయకులను బ్లాక్ మెయిల్ చేస్తూ లొంగకపోతే కేసులు పెట్టడం ఈ పదేళ్లలో సర్వసాధారణమైందని, నకిలీ ప్రజాస్వామ్యం, మత తత్వ దేశంగా చేసేందుకు కుట్రలు పన్నుతుందని, చాలా పత్రికలు మీడియాలపై అక్రమ కేసులు బనాయిస్తుందని, ముఖ్యంగా ప్రతిపక్ష నాయకులపై నిరాధార ఆరోపణలు చేసి వ్యక్తి హననంతో పాటు, వ్యక్తిగత, పార్టీ ప్రతిష్టలను దిగజార్చే విధంగా మోడీ సారథ్యంలో ప్రభుత్వం నడిపిస్తున్నారని, దేశంలో అసహనం, మత విభజన, నిరుద్యోగం, వక్ఫ్ బిల్లు, ట్రంప్ టారిఫ్ దారి మళ్లించేందుకు నకిలీ జాతి వాదాన్ని ప్రజలపై రుద్దుతున్నారని సంజయ్ ఆరోపించారు. ఆర్థిక తుఫాను రాబోతుందని రాహుల్ గాంధీ ప్రశ్నిస్తే వారిపై కేసులు విధించారని, వారిపై ఉన్న కేసులు ఎత్తివేయాలని కాంగ్రెస్ పార్టీ తరపున డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిటీ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు ఇర్ఫాన్, సిటీ నాయకులు అల్లావుద్దీన్, రూరల్ ఇంచార్జ్ మల్లికార్జున్ రెడ్డి, సుధీర్, ధనుంజయ్, ఓబీసీ నాయకులు గణేష్, రాజశేఖర్ రెడ్డి, సేవాదళ్ సుజాత తదితరులు పాల్గొన్నారు.

## వైద్యశాలను మరింతగా అభివృద్ధిపరచాలి..





**శ్రీశైలం, ఏప్రిల్ 16 (జనస్వరం) :** శ్రీశైలమహాక్షేత్రంలో శ్రీ శైలదేవస్థానం భక్తుల సౌకర్యార్థం నిర్విహి స్తున్న వైద్య శాలను బుధవారం ఉదయం కార్యనిర్వాహణాధికారి యం. శ్రీనివాసరావు పరిశీలిం చారు. తదుపరి వైద్యశాల సిబ్బ ందితో సమావేశం ఏర్పాటు చేసి వైద్యశాలను మరింతగా అభివృద్ధి పరచాలని, వైద్యశాలలో అవసరమైనటువంటి మందులు అన్నిటిని సిద్ధంగా ఉంచుకోవాలని అత్యవసర సమయంలో రోగులను మెరుగైన వైద్యసేవలు అందించేందుకు గాను ఇతరప్రాంతాలకు తరలించేందుకు అంబులెన్స్‌లు అందుబాటులో ఉంచుకోవాలని సిబ్బందిని ఆదేశించారు.

## 9న షటిల్ బ్యాట్మెంటన్ ప్రారంభం

**చింతపల్లి, ఏప్రిల్ 16 (జనస్వరం) :** గ్రామ దేవత ముత్యాలమ్మ తల్లి జాతర మహోత్సవాల నేపథ్యంలో చింతపల్లి గ్రామం క్రీడా ఉత్సాహంతో కళకళలాడేందుకు సిద్ధమవుతోంది. ఈ సందర్భంగా చింతపల్లి ముత్యాలమ్మ తల్లి బ్యాడ్మింటన్ క్లబ్ ఆధ్వర్యంలో ఒక ప్రత్యేకమైన షటిల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌ను ఈ నెల 19వ తేదీ నుండి నిర్వహించనున్నారు. ఈ పోటీలు ముత్యాలమ్మ ఆలయ ప్రాంగణంలో, 19వ తేదీ సాయంత్రం 5 గంటలకు ప్రారంభమవుతాయి. టోర్నమెంట్ నాకౌట్ పద్ధతిలో, ప్రతి మ్యాచ్ 21 పాయింట్లకు జరగనుండగా, మావీస్ 350 షటిల్స్‌ను ఉపయోగించనున్నారు.

**ఎంట్రీలు, బహుమతులు :**

ఈ టోర్నమెంట్‌లో పాల్గొనదలచిన జట్లు, ఏప్రిల్ 19 లోపల తమ ఎంట్రీలను నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. ఎంట్రీ ఫీజుగా రూ.500 నిర్ణయించినట్లు తెలిపారు. మొదటి బహుమతిగా విజేత జట్టుకు రూ.25,000, రెండో బహుమతిగా రూ.15,000 అందజేయనున్నట్లు క్లబ్ నిర్వాహకులు తెలిపారు. మరింత సమాచారం కోసం సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు రాము 9491258204, తారక్ 8500567056, నగేష్ 9491333543 ఈ టోర్నమెంట్ కేవలం క్రీడా పోటీ మాత్రమే కాదు, జాతర సందర్భంగా గ్రామ యువతలో ఉత్సాహం నింపే ఒక మంచి వేదికగా నిలవనుందని నిర్వాహకుల ఆశ. ప్రతి క్రీడాభిమాని పాల్గొనాలని వారు కోరుతున్నారు.

## 32 సంవత్సరాల తర్వాత జాలిపూడిలో

# ప్రారంభమైన అమ్మవార్ల జాతర మహోత్సవాలు

**- ప్రత్యేక పూజలు నిర్వహించి జాతర ఘట్టాన్ని ఘనంగా ప్రారంభించిన దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్**



**దెందులూరు, ఏప్రిల్ 16 (జనస్వరం) :** గ్రామాల్లో అనాదిగా వస్తున్న సంస్కృతి, ఆచార సంప్రదాయాలు కొనసాగించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ తెలిపారు. ఏలూరు రూరల్ మండలం జాలిపూడి గ్రామంలో 32 సంవత్సరాల తర్వాత తిరిగి ప్రారంభమైన శ్రీ గంగానమ్మ, శ్రీ ఆది మహాలక్ష్మమ్మ, శ్రీ వినుకొండ అంకమ్మ, శ్రీ పోతురాజు బాబు జాతర మహోత్సవాలను ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ముఖ్య అతిథిగా పాల్గొని జాతర వేడుకలను ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మేడలలో ప్రవేశపెట్టిన అమ్మవార్లకు, పోతురాజు బాబులకు ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవార్ల కరుణా కటాక్షాలు దెందులూరు నియోజకవర్గంలోని ప్రజలందరిపై ఉండాలని కోరుతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ “అనాదిగా వస్తున్న సంస్కృతి, సాంప్రదాయాలను, కొనసాగించడం ప్రతి ఒక్కరు బాధ్యతగా భావించాలని సూచించారు. జాలిపూడి గ్రామంలో 1993వ సంవత్సరంలో తొమ్మిది రోజుల పాటు అమ్మవారు జాతర కార్యక్రమాలను ఘనంగా నిర్వహించడం జరిగిందని, గ్రామ సుభిక్షం కోసం తిరిగి 32 సంవత్సరాల తర్వాత ఈరోజు మళ్లీ అమ్మవార్ల జాతర మహోత్సవాలను తిరిగి ప్రారంభించడం జరిగిందని, అటువంటి మహోన్నత కార్యక్రమం తన ఆధ్వర్యంలో జరిగేలా కమిటీ సభ్యులు అవకాశం ఇవ్వడం ఎంతో గర్వకారణంగా ఉందని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ తెలిపారు. ఈరోజు నుంచి 45 రోజులపాటు శ్రీ గంగానమ్మ శ్రీ ఆది మహాలక్ష్మమ్మ శ్రీ వినుకొండ అంకమ్మ శ్రీ పోతురాజు బాబు వారీ జాతర వేడుకలు నిర్విఘ్నంగా ఘనంగా నిర్వహిస్తామని, అందుకు ప్రభుత్వం తరపునుంచి అవసరమైన సహాయ సహకారాలు జాతర కమిటీ వారికి పూర్తిస్థాయిలో అందిస్తామని తెలిపారు. జాతరను ఘనంగా నిర్వహించడంలో గ్రామస్తులు ప్రతి ఒక్కరు కూడా తమ వంతు బాధ్యతగా చొరవ చూపాలని, అదే విధంగా భక్తులంతా కూడా ఈ జాతర వేడుకల్లో భక్తి శ్రద్ధలతో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా 45 రోజులు పాటు జరిగే జాతరకు సంబంధిత ప్రభుత్వ శాఖల అధికారులు పూర్తి సమన్వయంతో తమ సేవలు అందించాలని, అదేవిధంగా జాతర తుది ఘట్టంలో జరిగే వేడుకల్లో భాగం కావడానికి భక్తులు భారీ ఎత్తున తరలివస్తారు. పోలీస్ శాఖ సైతం బందోబస్తుపై ప్రత్యేక చర్యలు చేపట్టాలని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలో జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టిట్టాలని ప్రభుత్వాధికారులకు ఎమ్మెల్యే సూచించారు. ఈ సందర్భంగా జాతర ఆలయ కమిటీ నిర్వాహకులు చింతమనేని ప్రభాకర్‌కి అమ్మవారి తీర్థప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఏలూరు రూరల్ మండల పార్టీ అధ్యక్షులు నంబూరి నాగరాజు, క్లస్టర్ ఇంచార్జ్ నేతల రవి, సెక్రటరీ పైడిపాటి శేఖర్, నెక్స్ట్ జెన్ ఫీడ్ సంస్థ అధినేత అడుసుమిల్లి సుబ్రహ్మణ్యం సహా జాతర కమిటీ సభ్యులు, పలువురు కూటమి నాయకులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## గండి క్షేత్రంలో దివ్యంగులకు ప్రత్యేక దర్శనం కల్పించండి

**పులివెందుల, ఏప్రిల్ 16 (జనస్వరం) :** చక్రాయపేట మండలంలోని శ్రీ గండి ఆంజనేయ స్వామి దేవస్థానంలో దివ్యాంగులకు, వృద్ధులకు ప్రత్యేక దర్శనం కల్పించాలని ఆలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌కు వినతి పత్రం అందజేశామని వైసీపీ నియోజకవర్గం దివ్యాంగుల అధ్యక్షులు చాగలేటి భాస్కర్ అన్నారు. ఈ సందర్భంగా చాగలేటి భాస్కర్ మాట్లాడుతూ ఇక్కడ ఆలయ సిబ్బందికి గాని, ఆలయ పరిపాలన అధికారికి గాని, దివ్యాంగులకు, వృద్ధులకు, దర్శనం కల్పించాలని, కనీసం అవగాహన లేకపోవడం చాలా బాధాకరమన్నారు. ఆలయ చైర్మన్ కావలి కృష్ణ తేజ ను దివ్యాంగులకు, వృద్ధులకు, దర్శనం కల్పించాలని కోరారు. ఆయన వెంటనే స్పందించి ఖచ్చితంగా దివ్యాంగులకు వృద్ధులకు దర్శనం కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వికలాంగుల నెట్వర్క్ రాష్ట్ర అధ్యక్షుడు రఘునాథరెడ్డి ఈశ్వరయ్య. శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## దళిత మహిళను అమానుషంగా చంపిన నిందితులను కఠినంగా శిక్షించాలి

**సీమాంధ్ర ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు పందింటి సుబ్బయ్య**



**నెల్లూరు, ఏప్రిల్ 16 (జనస్వరం) :** నగరంలోని నవాబుపేట ప్రాంతంలోని కుసుమ హరిజనవాడకు చెందిన స్మైలీ అనే అమ్మాయిని మూడో మైలుకి చెందిన వ్యక్తి గత నాలుగు సంవత్సరాలుగా వెంటపడి ప్రేమిస్తున్నానంటూ నమ్మబలికి వివాహం చేసుకున్న నాలుగు నెలలకే వేధింపులకు గురిచేసి అతను, అతని బంధువులు చంపి వేశారని ఆరోపిస్తూ సీమాంధ్ర ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు పందింటి సుబ్బయ్య మాదిగ ఆధ్వర్యంలో బుధవారం నెల్లూరు రూరల్ పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా పందిటి సుబ్బయ్య మాట్లాడుతూ దళిత మహిళను అమానుషంగా చంపివేసి నిందితులు స్టేషన్లో లొంగిపోవడం చూస్తుంటే ఇదంతా పక్కా ప్రణాళిక ప్రకారమే చేశారని ఆరోపించారు. నిందితులను వెంటనే కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. దళిత మహిళకు న్యాయం జరిగే వరకూ దళిత సంఘాలు అన్నింటిని కలుపుకొని ఉద్యమం తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమం లో వివిధ దళిత సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## “స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణ ఆంధ్రా”పై ప్రజలకు అవగాహన కల్పించండి

**అదనపు కమిషనర్ వైఓ నందన్**



**నెల్లూరు, ఏప్రిల్ 16 (జనస్వరం) :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రతి నెల మూడో శనివారం నిర్దేశించిన “స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణ ఆంధ్రా” కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించి, పర్యావరణ పరిరక్షణలో వారిని కూడా భాగస్వాములు చేయాలని నెల్లూరు నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ వైఓ నందన్ సూచించారు. పబ్లిక్ హెల్త్ విభాగం, వార్డ్ సచివాలయ శానిటేషన్ కార్యదర్శులతో సమీక్ష సమావేశాన్ని కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కమిషనర్ మాట్లాడుతూ ఐవీఆర్ఎస్ విధానంలో ప్రజాభిప్రాయ సేకరణ ద్వారా పారిశుధ్య నిర్వహణ పనుల సంతృప్తి 70 శాతం కన్నా తక్కువగా ఉన్నట్లు గుర్తించామని, దానిని మెరుగుపరిచేందుకు అందరూ కృషి చేయాలని సిబ్బందికి సూచించారు. ఇంటింటి చెత్త సేకరణలో తప్పనిసరిగా తడి పొడి చెత్తను విడిగా సేకరించేలా పారిశుద్ధ సిబ్బందిని క్రమం తప్పకుండా పర్యవేక్షించాలని సూచించారు. శానిటేషన్ మేస్త్రీలు విధుల్లో బాధ్యతగా వ్యవహరించాలని, విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రధాన రోడ్లు, వీధుల పరిశుభ్రతలో భాగంగా ఏ ప్రాంతాన్ని అసంపూర్తిగా వదలకుండా రోడ్ల చివరి వరకు ఎండ్ టు ఎండ్ శుభ్రం చేయాలని, బహిరంగ ప్రదేశాల్లో ఫ్లోర్ పాయింట్లు అన్నవి లేకుండా పూర్తిగా తొలగించాలని ఆదేశించారు. చెత్త సేకరణ వాహనాలు చెత్తను తరలించే సమయంలో వ్యర్థాలు రోడ్లపై పడకుండా తప్పనిసరిగా పూర్తిస్థాయిలో కప్పి ఉంచేలా జాగ్రత్త చర్యలు తీసుకునేలా పర్యవేక్షించాలని ఆదేశించారు. భవన నిర్మాణ వ్యర్థాలు, శిధిలాలు రోడ్లపై, వీధుల వెంట లేకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షించి వాటిని తొలగించేయాలని కమిషనర్ సూచించారు. అన్ని డివిజన్లలో క్రమం తప్పకుండా డ్రైన్ కాలువల పూడికతీత, సిల్ట్ ఎత్తివేత పనులను చేపట్టాలని, తడి పొడి చెత్తను విడివిడిగా సేకరించేలా సిబ్బందిని పర్యవేక్షించాలని అదనపు కమిషనర్ ఆదేశించారు. ట్రేడ్ లైసెన్స్‌ల మంజూరు, కొత్త లైసెన్సుల గుర్తింపు ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించాలని, బహిరంగ ప్రదేశాలలో వ్యర్థాలు వేసే వారిని గుర్తించి జరిమానాలు విధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఆఫీసర్ డాక్టర్ చైతన్య, వెటర్నరీ డాక్టర్ మదన్మోహన్, ఈఈ రహంతు జానీ, పొల్యూషన్ ఎన్విరాన్మెంటల్ ఈఈ అశోక్ కుమార్, హోమ్ ల్యాండ్ ఏజెన్సీ సుమన్, శానిటరీ సూపర్వైజర్లు, ఇన్స్పెక్టర్లు, కార్యదర్శులు, మేస్త్రీలు, సిబ్బంది పాల్గొన్నారు.

## పోషణ పక్వాడ పక్షోత్సవాలు విజయవంతం

**ఐసీడీఎస్ సీడీపీఓ వెంకట రమణి**



**చింతపల్లి, ఏప్రిల్ 16 (జనస్వరం) :** స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో పోషణ పక్వాడ పక్షోత్సవాల కార్యక్రమాలు సిబ్బంది సహకారంతో దిగ్విజయంగా నిర్వహించబడుతున్నాయని ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అధికారిణి జి వెంకటరమణి అన్నారు. పోషణ పక్వాడ పక్షోత్సవాల కార్యక్రమాలలో భాగంగా రాజు పాకల సెక్టార్‌లోని ఎల్జీ జంక్షన్ అంగన్వాడీ కేంద్రంలో అంగన్వాడీ కార్యకర్తల సమక్షంలో ఆమె ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గర్భిణులు, బాలింతలకు సమగ్ర పోషకాహారం ప్రాముఖ్యతను వివరించడంతో పాటు, సాంప్రదాయ పద్ధతిలో సీమంతం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె పలు విషయాలను ప్రస్తావించారు. తక్కువ వ్యయంతో అధిక పోషక విలువలున్న ఆహారాన్ని ఎంచుకోవడం ద్వారా రక్తహీనతను నివారించవచ్చున్నారు. పోషకాహారంపై ప్రజల్లో అవగాహన పెంపొందించడంలో ఇటువంటి కార్యక్రమాలు ఎంతో దోహద పడతాయన్నారు. కిషోర్ బాలికలకు శారీరక, మానసిక ఆరోగ్యం, వృత్తి విద్యల ప్రాముఖ్యతపై చక్కటి అవగాహన కల్పించడమేకాకుండా, బాల్యవివాహాల వల్ల కలిగే నష్టాలను స్పష్టంగా వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు సత్తిబాబు, ఏసీడీపీఓ ఎం.రామలక్ష్మి, సూపర్వైజర్లు సంకడ గౌరి, కె.విజయ కుమారి, ఎస్కె గౌహరున్నిసా, పి.అప్పల నర్సమ్మ, స్థానిక అంగన్వాడీ కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీరామ రక్షారథానికి ఘనంగా స్వాగతం పలకాలి




**యలమంచిలి, ఏప్రిల్ 16 (జనస్వరం) :** విశాఖ డైరీ చైర్మన్ ఆనంద్ కుమార్ ఆధ్వర్యంలో అయోధ్య శ్రీరామరక్షా రథయాత్ర రథాన్ని ఘనంగా స్వాగతం పలికి గ్రామంలోకి తీసుకురావాలని ధర్మ రక్షా సమితి కార్యదర్శి కొల్లి అప్పారావు అన్నారు. యలమంచిలి నియోజకవర్గంలో నాలుగు మండలాలలో గ్రామ గ్రామానికి తీసుకెళ్లాలని సంకల్పంతో ఈ నెల 13వ తేదీన మునగపాక మండలంలో ప్రారంభమైంది. ముందుగా ప్రతి గ్రామంలోనూ పెద్దలను కలిసి శ్రీరామరక్షా రథయాత్రను విజయవంతం చేయాలని గ్రామ కమిటీలు వేయటం. సర్పంచులను పెద్దలను ఆహ్వానించడం జరుగుతుందన్నారు. దీనిలో భాగంగా బుధవారం తంతడి రాజన్నపాలెం, గండివాని పాలెం, దోసూరు, మడుతురు, అప్పన్నపాలెం, రామన్నపాలెం గ్రామాలలో పెద్దలను సర్పంచులను ఆహ్వానించి కమిటీ వేశారు. ఈ కార్యక్రమంలో కొల్లి అప్పారావు విశాఖ డైరీ అచ్చుతాపురం మండల మేనేజర్ పడాల గురునాథరావు, సూపర్వైజర్ కన్నూరు వరహా మూర్తి, తంతడి సర్పంచ్ మరియు చౌడపల్లి సత్యం, చెల్లిబోయిన కృష్ణ, దొడ్డి అప్పారావు, రాజన్నపాలెం సర్పంచ్ రాజాన నానాజీ, శర్మ మాస్టారు, రామన్నపాలెం ఎంపిటిసి లాలం శీను, ధర్మిరెడ్డి రాము, సత్యం తదితరులు పాల్గొన్నారు

## క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయి

**- ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్ట్ అధినేత ముదునూరిలి**

**- విజేతలకు బహుమతులు ప్రదానం చేసిన ముదునూరి**




**ప్రత్తిపాడు, ఏప్రిల్ 16 (జనస్వరం) :** క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని వైసీపీ నేత, ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్ట్ అధినేత ముదునూరి మురళీ కృష్ణంరాజు అన్నారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతి సందర్భంగా జై భీమ్ యూత్ ఆధ్వర్యంలో కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం ధర్మవరం గ్రామంలో జిల్లాస్థాయి మెగా క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిశ ముదునూరి మురళి కృష్ణంరాజు హాజరై విజేత బహుమతులు ప్రదానం చేసారు. ఈ మెగా క్రికెట్ టోర్నమెంట్లో మొత్తం 26 టీమ్స్ తలపడగా మొదటి విజేతగా నిలిచిన సామర్లకోట టీంను అభినందించి గోల్డ్ మెడల్, షీల్డ్, రూ.15000లు చెక్కును అందజేశారు. ద్వితీయ బహుమతి ఏలేశ్వరం టీంకి రూ.10000లు సర్పంచ్ బెంతుకుర్తి సుశీల అబ్బాయి, తృతీయ బహుమతి ధర్మవరం టీంకి రూ.5000లు వూభా కృపావరం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు శరీర దారుఢ్యంతో పాటు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని, చిన్నతనం నుంచే క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలన్నారు. పట్టుదల ఉంటే ఏదైనా సాధించవచ్చునని, క్రీడా పోటీల్లో ప్రతి ఒక్కరూ గెలుపు ఓటములను పట్టించుకోకుండా క్రీడా స్ఫూర్తిని చాటాలన్నారు. క్రీడల్లో ముందుకు సాగాలంటే సాధననే ముఖ్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో కోలా తాతబాబు, బొల్లు నాగేశ్వరరావు, పోకనాటి వెంకటేశ్వరరావు, జువ్వల దొరబాబు, యాళ్ల యేసు, జువ్వల ముసలయ్య, దడాల అప్పన్నబాబు, వెంటిపల్లి చంద్రశేఖర్, తోట భాస్కర్, రాపా గుర్రాజు, ఇంటి వీర్రాజు, అంబటి గణేష్, జువ్వల రవి, గుడాల కన్నా, బైర శ్రీనివాస్, ధారా నవీన్, దడాల సతీష్, సిద్ధాంతపు రాజశేఖర్, బోరా రాజు తదితరులు పాల్గొన్నారు

## మెడికవర్‌లో చిన్నారికి అత్యంత అరుదైన ఆపరేషన్

**5 ఏళ్ల బాలికను కాపాడిన డాక్టర్లు**




**నెల్లూరు, ఏప్రిల్ 16 (జనస్వరం) :** ఊపిరితిత్తులకు సంబందించి ఓ చిన్నారికి అత్యంత అరుదైన శస్త్ర చికిత్స చేసి ప్రాణాలు కాపాడిన సంఘటన నెల్లూరులోని మెడికవర్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో చోటు చేసుకుంది. ఇందుకు సంబందించిన వివరాలను బుధవారం జరిగిన విలేకరుల సమావే శంలో కోలుకున్న పాపతో కలిసి ఆ ఆస్పత్రి పల్మనాలజిస్ట్ డాక్టర్ కాటంరెడ్డి కౌశిక్‌రెడ్డి, పీడియాట్రి షియన్ డాక్టర్ ఉదయకీర్తి, అనస్థీషియన్ చీఫ్ డాక్టర్ రంగనాథ్‌లు వివరించారు. తీవ్రమైన ఆయాసం, దగ్గు, జ్వరంతో మాట్లాడలేని స్థితిలో ఉన్న కావలి పట్టణానికి చెందిన 5 ఏళ్ల సత్య అనే చిన్నారిని పాప తల్లిదండ్రులు అఖిల, తిరుపతి వారం క్రితం మెడికవర్ ఆస్పత్రికి తీసుకుని వచ్చారన్నారు. అప్పటికే కావలిలో తీయించుకున్న ఎక్స్‌రేను పరిశీలించగా ఎడమ ఊపిరితిత్తి మూసుకుని పోయిందన్నారు. నెమ్ముతో ఉన్నట్టు అర్ధమయిందన్నారు. తక్షణమే పాపకు సీటీ స్కాన్ చేయగా ఊపిరితిత్తులో ఏదో వస్తువు (ఫారెన్‌బాడి) ఉండి ఊపిరితిత్తి మూసుకుని పోయినట్టుగా గుర్తించి పాపను ఇంటర్‌వెన్షనల్ పల్మనాలజి విభాగానికి మార్చడం జరిగిందన్నారు. ఇలాంటి పరిస్థితిలో పాప ప్రాణాలకు ముప్పు ఉంటుందన్నారు. అయితే తమ డాక్టర్ల బృందం ఫ్లెక్సిబుల్ బ్రాంకోస్కోపి అనే అధునాతన శస్త్ర చికిత్సతో ఫోగాట్ బెలూన్ వేసి ఊపిరితిత్తులో ఉన్న వస్తువును బయటకు తీసి చూడగా అది తమలపాకుతో పాటు వేసుకునే వక్కగా తేలిందన్నారు. ఇంట్లో వారు వేసుకుంటున్న వక్కను పొరపాటున పాప మింగే క్రమంలో ఊపిరితిత్తులోకి పోయిందన్నారు. సాదారణంగా ఆయాసాన్ని చూసి అందరూ డాక్టర్లు ఊపిరితిత్తుల నెమ్ముగా అనుకుంటారని తెలిపారు. కాని తాము జాగ్రత్తగా పరిశీలించి తమ వద్ద ఉన్న అధునాతన వైద్యపరికరాలు, సీనియర్ డాక్టర్ల బృందంతో కలిసి చికిత్స అందించామన్నారు. పాప కోలుకుందన్నారు. ఇలాంటి క్లిష్టమైన ఆపరేషన్లకు చెన్నై. హైదరాబాద్‌లాంటి మెట్రోపాలిటిన్ నగరాల్లోని కార్పొరేట్ ఆస్పత్రిలకు వెళ్లాల్సిన పని లేదని మెడికవర్‌లో అన్ని రకాల సేవలు అందుబాటులో ఉన్నాయన్నారు.పాప తల్లిదండ్రులు పేదలు కావడంతో అతి తక్కువ ఖర్చుతో వైద్యసేవలందించామన్నారు. ప్రాణాలు కాపాడిన డాక్టర్లకు పాప తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

## శాస్త్రోక్తంగా .. సాక్షిగణపతి స్వామికి విశేషఅభిషేకం



**శ్రీశైలం, ఏప్రిల్ 16 (జనస్వరం) :** ద్వాదశాజ్యోతిర్లింగ క్షేత్రమైన శ్రీశైలంలో సాక్షిగణపతి స్వామి వారికి విశేష అభిషేకాన్ని నిర్వహించారు. ప్రతి బుధవారం, సంకటహరచవితి రోజులు, పౌర్ణమి రోజులలో శ్రీ సాక్షి గణపతి స్వామి వారికి ఈ విశేష అభిషేకం, పూజాదికాలు దేవస్థానం(సర్కారీ) సేవగా నిర్వహిస్తారు. ఈ సేవలో భాగంగా బుధవారం ఉదయం సాక్షిగణపతి స్వామి వారికి పంచా మృతాలతోను, పలు ఫలోదాకాలతోనూ, హరిద్రోదకం, గందోధకం, పుష్పోదకం, కలశోదకం, శుద్ధజలంతో అర్చక స్వాములతో అభిషేకం నిర్వహించి ప్రత్యేకాహారతులను సమర్పించారు.

## నెల్లూరు ఆర్టీసీ కాలనీకి చెందిన మహిళ గిన్నిస్ రికార్డ్ సాధన




**నెల్లూరు, ఏప్రిల్ 16 (జనస్వరం) :** నగరంలోని ఆర్టీసీ కాలనీకి చెందిన వాస్తవ్యులు డి.స్వప్న గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో ఘనత సాధించారు. హైదరాబాద్‌లోని హల్లెల్ మ్యూజిక్ స్కూల్ ఆధ్వర్యంలో 2024 డిసెంబర్ 1న జరిగిన సంగీత కార్యక్రమంలో, కీబోర్డ్ వాయిద్యం వాయిస్తూ కేవలం 45 సెకండ్లలో మూడు స్వరాలను వాయించి ప్రపంచ రికార్డు సృష్టించారు. ఈ మేరకు, సోమవారం హైదరాబాద్‌లో జరిగిన ఓ ప్రత్యేక కార్యక్రమంలో, గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ప్రతినిధులు ఆమెకు అధికారిక సర్టిఫికేట్‌ను అందజేశారు. ఈ అద్భుత విజయంతో నెల్లూరు నగరం మళ్ళీ సంగీత ప్రపంచంలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది.

## కైలాసపట్నం అగ్ని ప్రమాద బాధిత కుటుంబాలకు చెక్కులు అందజేత



**పాయకరావుపేట, ఏప్రిల్ 16 (జనస్వరం) :** నియోజకవర్గంలోని కోటవురట్ల మండలంలోని కైలాసపట్నం గ్రామంలో జరిగిన అగ్ని ప్రమాదంలో మృతుల కుటుంబాలను హోం మంత్రి వంగలపూడి అనిత బుధవారం పరామర్శించారు. మృతుల కుటుంబ సభ్యులను ఓదార్చి, ప్రభుత్వం అండగా ఉంటుందని ధైర్యానిచ్చారు. ఈ సందర్భంగా హోం మంత్రి బాధిత కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం చెక్కులను అందజేశారు. కైలాసపట్నం గ్రామానికి చెందిన పురం పాప, జి గోవిందు, జి వేణుబాబు, చౌడివాడ గ్రామానికి చెందిన యస్ బాబూరావు, రాజుపేట గ్రామానికి చెందిన దాడి రామలక్ష్మి కుటుంబ సభ్యులకు 15 లక్షల చొప్పున చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి అనిత మాట్లాడుతూ ఈ ఘటన అత్యంత దురదృష్టకరమన్నారు. ప్రమాదం జరిగిన వెంటనే సీఎం, డిప్యూటీ సీఎం తక్షణమే స్పందించి అధికారులను, ప్రజాప్రతినిధులను సహాయక చర్యల్లో పాల్గొనాలని ఆదేశించారని తెలిపారు. క్షతగాత్రులను వెంటనే ఆసుపత్రికి తరలించి, మెరుగైన వైద్యం అందించామన్నారు. ప్రభుత్వం బాధిత కుటుంబాలకు అన్ని విధాలుగా అండగా ఉంటుందని, మృతుల కుటుంబాల సంరక్షణ బాధ్యతను ప్రభుత్వం భుజాన వేసుకుందన్నారు. మహేష్, బాలసాయి అనే పిల్లల విద్యా భవిష్యత్తును కూడా ప్రభుత్వం చూసుకుంటుందన్నారు. క్షతగాత్రులకు కూడా చెక్కులు అందజేస్తామని మంత్రి అనిత పేర్కొన్నారు.

## డిప్యూటీ ఎంపీడీవో మూర్తి బాబుకు సత్కారం



**పాలకొల్లు, ఏప్రిల్ 16 (జనస్వరం) :** మండల ఈఓపీఆర్ అండ్ ఆర్డీ గా పనిచేస్తున్నా తాళ్ళ మూర్తి బాబుకు, డిప్యూటీ ఎంపీడీఓగా ప్రభుత్వం డిజిగ్నేషన్ మార్పు చేసిన సందర్భంగా బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ ఉమామహేశ్వం రావు పర్యవేక్షణలో మండలంలో ఉన్న పంచాయతీ కార్యదర్శులు, మెడికల్ డిపార్ట్ మండల ఆరోగ్య విస్తరణ అధికారి, గుడాల హరి బాబు తదితరుల చేతుల మీరుగా ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మూర్తి బాబు మాట్లాడుతూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పట్ల హర్షం వ్యక్తం చేశారు. నిబద్ధతతో పనిచేస్తానని, డిప్యూటీ ఎంపీడీఓగా పేరు మారినప్పటికీ తాము నిర్వహించే బాధ్యతలు ఏమాత్రం మారవని స్పష్టం చేశారు. కార్యదర్శుల సమిష్టి కృషి సహకారంపాల్గొన్నారు మండల ప్రాంత గ్రామాలను ఆరోగ్యవంతంగా, మరింత స్వచ్ఛంగా, పరిశుభ్రంగా ఉంచడానికి తన వంతు కృషి చేస్తానని చెప్పారు. పోలపల్లి పంచాయతీ కార్యదర్శి పాలా శ్రీను, ఉల్లంపర్రు పంచాయతీ కార్యదర్శి లింగం సత్యనారాయణ, సుంకర గాయత్రి, శివదేవుని చిక్కాల పంచాయతీ కార్యదర్శి సుధారాణి, పెదమామిడిపల్లి పంచాయతీ కార్యదర్శి హిమబిందు, లంకలకోడేరు పంచాయతీ కార్యదర్శి రాజేష్, చింతపర్రు పంచాయతీ కార్యదర్శి శివ, చందపర్రు పంచాయతీ కార్యదర్శి హర్ష, గవరపేట పంచాయతీ కార్యదర్శి ములికి దిలీప్, పాల్గొన్నారు

## ఎక్సైజ్ అధికారుల దాడుల్లో ఒక వ్యక్తి అరెస్టు - మరొక వ్యక్తి పరారీ



**పాయకరావుపేట, ఏప్రిల్ 16 (జనస్వరం) :** పాయకరావుపేట ప్రిహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ జి శ్రీనివాసు బుధవారం తమ సిబ్బందితో కలసి ముందుగా అందిన సమాచారం మేరకు గుంట పల్లిలో దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఇద్దరు వ్యక్తులు ఒక ద్విచక్ర వాహనంపై 30 లీటర్లు నాటుసారాతో రావడం గమనించి వారిని నిలుపుదల చేయగా వారిలో గుంటపల్లి గ్రామానికి చెం దిన వ్యక్తి అధికారులను తప్పించుకొని పారిపోయాడు. మంగవరం గ్రామానికి చెందిన వ్యక్తిని అదు వులోనికి తీసుకొని వీరిద్దరిపైనా కేసులు నమోదు చేశారు. పారిపోయిన వ్యక్తి గురించి అధికారులు విచారణ జరుపుతున్నారు. ఈ కేసులో 30 లీటర్లు నాటుసారా, ఒక ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నారు. అరెస్టు చేసిన వ్యక్తిని రిమాండ్ నిమిత్తం యలమంచిలి అడిషనల్ జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టుకు తరలించారు. ఈ దాడుల్లో పాయకరావుపేట ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ ఇన్స్పెక్టర్ జి శ్రీనివాసు, హెడ్ కానిస్టేబుల్ బి రమణ, కానిస్టేబుళ్లు డి నాగ శంకరరావు, ఎస్ త్రివేణి పాల్గొన్నారు.

## శ్రీరాంపురంలో రైతులకు 9 (2) నోటీసులు జారీ



**పాయకరావుపేట, ఏప్రిల్ 16 (జనస్వరం) :** మండలంలోని శ్రీరాంపురంలో బుధవారం స్థానిక రైతులకు తహశీల్దారు జి సత్యనారాయణ 9 (2) నోటీసులు జారీ చేశారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో జరిగిన ఒక కార్యక్రమంలో ఈ నోటీసులను రైతులకు అందజేశారు. శ్రీరాంపురం గ్రామంలో కొంతకాలంగా రైతులకు సంబంధించిన భూముల రీ సర్వే కార్యక్రమం జరుగుతోన్న సంగతి తెలిసిందే. ఈ కార్యక్రమంలో భాగంగా రీ సర్వే పూర్తి అయిన రైతులకు రెవెన్యూ అధికారులు 9 (2) నోటీసులు జారీ చేస్తున్నారు. శ్రీరాంపురంలో ఇప్పటివరకూ సుమారు 500 మంది రైతులకు ఈ నోటీసులు జారీ చేశామని తహశీల్దారు సత్యనారాయణ తెలిపారు. ఇంకా దాదాపు 800 మంది రైతులకు ఈ నోటీసులు జారీ చేయాల్సి ఉందన్నారు. ప్రస్తుతం ఎటువంటి వివాదాలు లేనటువంటి రైతుల జిరాయితీ భూముల రీ సర్వే పూర్తి చేస్తున్నామని, సెకెండ్ స్పెల్ లో డి పట్టా, సీలింగ్ భూముల రీ సర్వే చేపడతామని తెలిపారు. ప్రస్తుతం 9 (2) నోటీసులు అందుకున్న రైతులు తమ భూములకు సంబంధించిన అభ్యంతరాలు ఏమైనా ఉంటే రెవెన్యూ అధికారులకు తెలియజేయాలని తహశీల్దారు సత్యనారాయణ చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల రీ సర్వే డిప్యూటీ తహశీల్దారు ఎల్ రాజేంద్రప్రసాద్, మండల సర్వేయరు పి శ్రీనివాస్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేగా చింతమనేని రాకతో

# అభివృద్ధి బాట పట్టిన దెందులూరు నియోజకవర్గం

**- నియోజకవర్గంలోని రోడ్లకు మహర్దశ**

**- శరవేగంగా సాగుతున్న గ్రామాల్లో రోడ్ల నిర్మాణ పనులు**



**దెందులూరు, ఏప్రిల్ 16 (జనస్వరం) :** మండలంలోని సోమవరపాడు గ్రామంలో రూ.74 లక్షల ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో నిర్మించిన రోడ్డును ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ యాదవ్‌తో కలిసి ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ కలిసి ప్రారంభించారు. సోమవరపాడు వద్ద స్వర్గీయ నందమూరి తారక రామారావు విగ్రహానికి ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ యాదవ్, ఎమ్మెల్యే చింతమనేని స్థానిక కూటమి నాయకులు భారీ గజ మాలలు వేసి నివాళులర్పించారు. నియోజకవర్గ పర్యటనలో భాగంగా దెందులూరు విచ్చేసిన ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ యాదవ్, దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌కి టీడీపీ దెందులూరు మండల పార్టీ అధ్యక్షులు మాగంటి నారాయణ ప్రసాద్ (మిల్లు బాబు) ఆధ్వర్యంలో పూల జల్లులతో, మహిళల మంగళ హారతులతో స్థానిక కూటమి నాయకులు, గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ యాదవ్ మాట్లాడుతూ ఏలూరు పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో అద్వాన స్థితిలో ఉన్న రోడ్లను పటిష్టపరిచేందుకు అవసరమైన కేంద్ర నిధులను సాధించి ఏలూరు పార్లమెంటు పరిధిలో ఉన్న అసెంబ్లీ నియోజకవర్గాలలో రోడ్ల సమస్యలను పరిష్కరించే దిశగా కృషి చేస్తున్నామని ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ యాదవ్ తెలిపారు. దెందులూరు నియోజకవర్గం చింతమనేని ప్రభాకర్ హయాంలో తిరిగి అభివృద్ధి పథంలో పయనించడం ఎంతో అభినందనీయమని, అభివృద్ధి అంటేనే కేరాఫ్ అడ్రస్‌గా చింతమనేని ప్రభాకర్ నిలుస్తున్నారని ఎంపీ పుట్ట మహేష్ యాదవ్ తెలిపారు. అదేవిధంగా నియోజకవర్గాల్లోని ఇతర సమస్యలను సైతం ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించుకుంటూ ప్రజా సమస్యలను పరిష్కరిస్తున్నామని ఎంపీ తెలిపారు. ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ "గత ఐదేళ్ల వైసీపీ అస్తవ్యస్త పాలనలో గ్రామాల్లోని రోడ్లన్నీ కూడా ఎంతో అధ్వాన స్థితికి చేరుకొని, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పాలయ్యారన్నారు. కూటమీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అధ్వాన స్థితిలో ఉన్న రోడ్లపై గుంతలను పూడ్చే కార్యక్రమాలను యుద్ధ ప్రాతిపదికన చేపట్టి ప్రజల ఇక్కట్లను తీర్చడంలో భాగమైందన్నారు. అదేవిధంగా నియోజకవర్గ పరిధిలో ఐదేళ్ల వైసీపీ అసమర్థ పాలనలో అసంపూర్తిగా నిలిచిపోయిన పలు రోడ్లను పూర్తి చేయడమే కాకుండా, సీఎం చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ యాదవ్ సహకారంతో నియోజకవర్గంలోని గ్రామాల్లో అవసరమైన బీటీ రోడ్లు, సిమెంట్ రోడ్ల నిర్మాణం కూడా చేపట్టారని, ఈ రోడ్ల నిర్మాణ పనులు, అభివృద్ధి పనులు నియోజకవర్గంలో ముమ్మరంగా సాగుతున్నాయని తెలిపారు. వీటిలో భాగంగానే సోమవరపాడు గ్రామంలో రూ.74 లక్షల వెచ్చించి మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధుల ద్వారా నిర్మించిన రోడ్డును ఈరోజు ఎంపీ గారితో కలిసి ప్రారంభించడం జరిగిందని, అదేవిధంగా గోపన్నపాలెం నుంచి రామసింగవరం వరకు అద్వానంగా ఉన్న రోడ్లను పటిష్టపరిచేందుకు మూడు కోట్ల రూపాయల నిధులతో రోడ్ల అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందని, సత్వరమే ఈ పనులు కూడా పూర్తి చేసెల చర్యలు చేపట్టినట్టు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీల అధ్యక్షులు, సీనియర్ నాయకులు, క్లస్టర్ ఇంచార్జిలు, కూటమి నాయకులు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

## ఎస్సీల స్వయం ఉపాధి పథకాలకు వందశాతం రుణాలు ఇవ్వాలి

**కలెక్టర్ శ్రీధర్ చామకూరి**



**పులివెందుల ఏప్రిల్ 16 (జనస్వరం) :** అన్నమయ్య జిల్లాలో ఎస్సీల స్వయం ఉపాధి పథకాలకు బ్యాంకర్లు వందశాతం రుణాలు ఇవ్వాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి బ్యాంకర్లను ఆదేశించారు. బుధవారం రాయచోటి కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో 2025-26లో ఎస్సీ కార్యాచరణ ప్రణాళిక కింద ఏపీ ఆన్లైన్ బెనిఫిషరీ మేనేజ్మెంట్ అండ్ మోనిటరింగ్ సిస్టం వెబ్సైట్ ద్వారా ఎస్సీల స్వయం ఉపాధి పథకాలకు రుణాల మంజూరు అంశంపై బ్యాంకర్లతో కలెక్టర్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎస్సీలకు ఉపాధి కల్పన, స్వయం ఉపాధికి ప్రోత్సాహం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఈ మేరకు 2025-26లో ఎస్సీ ప్రణాళిక కింద జిల్లాకు 563 యూనిట్లను కేటాయించడం జరిగిందన్నారు. ఈ 563 యూనిట్లకు వివిధ సెక్టార్లలో రూ.2341 లక్షలు రుణాలు ఇవ్వాలని, ఇందులో రూ.924 లక్షలు 40 శాతం మేర రాయితీగా పరిగణిస్తారని చెప్పారు. ఈ కార్యాచరణ ప్రణాళిక అమలుకు ప్రభుత్వం కాలపరిమితిని నిర్దేశించిందన్నారు. కమిటీ ద్వారా ఎంపిక చేసిన అర్హుల వివరాలను ఎస్సీ కార్పొరేషన్, ఎంపీడీవోలు సమన్వయంగా ఆన్లైన్లో నమోదు చేస్తారని చెప్పారు. ఇందుకు సంబంధించి తగిన కార్యాచరణ రూపొందించుకొని అర్హులైన వారందరికీ రుణాలు అందజేయాలని.. బ్యాంకుల వారీగా ఇచ్చిన లక్ష్యాలను తప్పనిసరిగా అధిగమించాలని బ్యాంకర్లకు సూచించారు. స్వయం ఉపాధి పథకాల ద్వారా ఎస్సీలకు రుణాలు అందించడంతో వారి కుటుంబాలు ఆర్థికంగా అభివృద్ధిలోకి వస్తాయన్నారు. ఈ ప్రక్రియకు సంబంధించి ప్రభుత్వం జారీ చేసిన విధివిధానాలను పాటించి కాలయాపన చేయకుండా త్వరితగతిన రుణాలు మంజూరు చేయాలన్నారు. అర్హుల ఎంపికకు సంబంధించి ఎంపీడీఓలతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. క్షేత్రస్థాయిలో ఏవైనా సమస్యలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు.

**జిల్లాకు 34 డ్రోన్ యూనిట్లు :**

వ్యవసాయంలో ఆధునిక టెక్నాలజీ డ్రోన్లను ఉపయోగించడం ద్వారా అత్యుత్తమమైన ఫలితాలను పొందేందుకు ముఖ్యమంత్రితో పాటు రాష్ట్ర ప్రభుత్వం రైతన్నలకు చేయూతను అందిస్తోంది. ఈ క్రమంలో వ్యవసాయంలో డ్రోన్ వినియోగం పెంచడానికి కూడా రుణాలు అందించాలని ప్రభుత్వం భావిస్తోంది. జిల్లాకు 34 డ్రోన్ యూనిట్లు మంజూరు కావడం జరిగింది. ఒక్కొక్క బృందంలో ఐదు మంది సభ్యులతో యూనిట్ ఏర్పాటు చేస్తారు. 80 శాతం రాయితీతో డ్రోన్ యూనిట్ల మంజూరుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. బ్యాంకు రుణం కేవలం 20 శాతం మాత్రమే. డ్రోన్ యూనిట్లకు కూడా కాలయాపన చేయకుండా త్వరితగతిన రుణాలు అందజేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. అనంతరం వివిధ అంశాలను చర్చించి తగు సూచనలు జారీ చేశారు. ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ జెడి చంద్ర నాయక్, లీడ్ బ్యాంక్ మేనేజర్ ఆంజనేయులు, ఎస్సీ కార్పొరేషన్ సిబ్బంది భాస్కర్, వివిధ బ్యాంకర్లు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా భారతీయ రైల్వే ఆవిర్భావ దినోత్సవం



**యలమంచిలి, ఏప్రిల్ 16 (జనస్వరం) :** భారతీయ రైల్వే ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బుధవారం రైల్వే స్టేషన్‌లో యలమంచిలి రైల్వే కన్సుల్టేన్సీ మెంబెర్స్ ఆధ్వర్యంలో కేక్ కుటుంబ చేసి శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. ఈ కార్యక్రమంలో కన్సుల్టేన్సీ మెంబెర్స్ అగ్గాల హనుమంతరావు మాట్లాడుతూ ప్రపంచంలోనే భారతీయ రైల్వేకి ఒక గుర్తింపు ఉందని, అలాగే బీజేపీ ప్రభుత్వం ఏర్పడ్డాక వేల కోట్లతో రైల్వే స్టేషన్స్ ఆధునికరణ జరుగుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పిట్టా దాసుబాబు, నక్క శివ శంకర్, లక్ష్మణ రావు, ఆచార్యులు, లాయర్ శివ, పప్పు ఈశ్వర్ రావు, రాజు, జయంత్ తదితరులు పాల్గొన్నారు

## దోషులను తక్షణమే అరెస్టు చేయాలి

**దళితుల ఉద్యమానికి సంఘీభావం తెలిపిన వైసీపీ నేత సరమర్ల మధుబాబు**



**శంఖవరం, ఏప్రిల్ 16 (జనస్వరం) :** శంఖవరం గ్రామంలో రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌కి జరిగిన అవమానానికి బుధవారం శంఖవరం గ్రామంలో దళితులు చేపట్టిన నిరసనకు మద్దతుగా వైసీపీ నాయకులు మద్దతు తెలియజేశారు. ప్రత్తిపాడు నియోజకవర్గ వైసీపీ కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు ఆదేశాల మేరకు వైసీపీ పబ్లిసిటీ వింగ్ అధ్యక్షులు సరమర్ల మధుబాబు దీక్షా శిబిరాన్ని సందర్శించి, ఘటనకు కారకులైన దోషులను శిక్షించే వరకు దళితులు తరఫున వైసీపీ పోరాటం చేస్తుందని, నిందితులను అరెస్టు చేసేందుకు పోలీసులు 24 గంటలు సమయం ఇవ్వాలని కోరడంతో దళితులు శాంతియుతంగా నిరసన చేపట్టారని, ప్రభుత్వం తక్షణమే ఎటువంటి రాజకీయ నాయకులు ప్రమేయం లేకుండా పోలీసులు నిందితులని అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. అంబేద్కర్ విగ్రహానికి జరిగిన అవమానాన్ని పూర్తిగా వైసీపీ ఖండిస్తుందని దోషులను పట్టుకోకపోతే నియోజకవర్గ వైసీపీ కోఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు ఆదేశాల వరకు త్వరలో భవిష్యత్ కార్యాచరణ చేపడతామని పిలుపునిచ్చారు. వైసీపీ నాయకులు రాయి శ్రీనివాస్, గంటా భాస్కర్, దళిత సంఘాల నాయకులు ముఖే వీరబాబు, గునపర్తి అపురూపు, గుద్దాటి నాగేశ్వరరావు, రాజు, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

## లోకాకల్యాణంకోసం..జ్వాలావీరభద్రస్వామికి విశేషపూజలు..



**శ్రీశైలం, ఏప్రిల్ 16 (జనస్వరం) :** శ్రీశైలమహాక్షేత్రంలో లోక కల్యాణం కోసం దేవస్థానం బుధవారం సాయంత్రం ఆలయ ప్రాంగణంలోని జ్వాలా వీరభద్రస్వామి వారికి అర్చకస్వాములు విశేషపూజలు నిర్వహించారని దేవస్థానం కార్యనిర్వహణాధికారి యం. శ్రీనివాసరావు తెలిపారు. ఆలయప్రాంగణంలో మల్లికా గుండం ప్రక్కనేఉన్న వీరభద్రస్వామి జ్వాలామకుటంతో పది చేతులతో విశిష్ట రూపంలో దర్శనమిస్తాడు. శిల్పశాస్త్ర పరిభాషలో ఈ స్వామికి అఘోరా వీరభద్రమూర్తి అని పేరు కూడా ఉంది. ఈ స్వామి పరివార ఆలయాలలో భాగంగా ప్రతి నిత్యం పూజలు నిర్వహిస్తారు. ప్రదోషకాలంలో విశేష అభిషేకం ఆలయఅర్చకులు నిర్వహించారు.

## కళారాధనలో... గాత్రకచేరి!




**శ్రీశైలం, ఏప్రిల్ 16 (జనస్వరం) :** శ్రీశైలదేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథంలో భాగంగా బుధవారం ఏర్పాటు చేసిన గాత్రకచేరి భక్తులకు విశేషంగా అలరించింది.శ్రీ స్వామి అమ్మవార్లకు ఆయా కైంకర్యాలన్ని పరిపూర్ణంగా జరగాలని, ప్రాచీన సంప్రదాయ కళల పరిరక్షణలో భాగంగా ఆలయ దక్షిణ మాడవీధిలోని ధర్మపథం వేదికపై యూ.వి.ఎస్ కిరణ్ బృందం కర్నూలు వారిచే గాత్రకచేరి నిర్వహించారు. కార్యక్రమంలో పలు భక్తి గీతాలకు, అష్టకష్టాలకు కిరణ్ బృందం ఆలపించారు ఈ నిత్య కళారాధనలో ప్రతిరోజు హరికథ, బుర్రకథ, సాంప్రదాయ నృత్యం, వాయిద్య సంగీతం, భక్తిరంజని కార్యక్రమాలు నిర్వహిస్తారు.

## మెగా అసెస్మెంట్ క్యాంపును వినియోగించుకోవాలి

**ఎంపీడీఓ ఎస్‌కెవి ప్రసాద్**



**కొయ్యూరు, ఏప్రిల్ 16 (జనస్వరం) :** 19న చింతపల్లిలో జరిగే మెగా అసెస్మెంట్ క్యాంపును దివ్యా ంగులు వినియోగించుకోవాలని కొయ్యూరు ఎంపీడీఓ ఎస్‌కెవి ప్రసాద్ కోరారు. ఆర్టిఫిషియల్ లిమ్స్ మ్యానుఫ్యాక్చరింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా వారి సౌజన్యం దివ్యాంగులకు ఉపకరణాలు, కృత్రిమ అవయవాలు, పునరావాసం, సహాయల లభ్యత కృత్రిమ అవయవాలు ఉపయోగం మంజూరు మొద లగు వాటిపై వారి అర్హతను, అవసరాలు పరిశీలించడం కొరకు శనివారం చింతపల్లి మండల కేం ద్రం వద్ద మెగా అసెస్మెంట్ క్యాంప్‌ను ఏర్పాటు చేయుచున్నారని తెలిపారు. ఆసక్తి కలిగిన ప్రతి ఒక్క దివ్యాంగులు ఈ మెగా సదరం క్యాంపునకు హాజరు కావాలని కోరారు. హాజరయ్యే వారు వారి సదరం సర్టిఫికెట్లు, ఆధార్ కార్డు, రేషన్ కార్డుతో హాజరు కావాలని కోరారు.

## కంతారం ఎంపీపీ స్కూల్లో ఫేర్వల్ పార్టీ



**కొయ్యూరు ఏప్రిల్ 16 (జనస్వరం) :** మండలంలోని కంతారం పంచాయతీలో గల కంతారం ఎంపీపీ స్కూల్లో ఘనంగా ఫేర్వల్ పార్టీ నిర్వహించారు. ఈ పార్టీలో స్కూల్ పిల్లలు నృత్యాలు వేస్తూ, ఆటపాటలతో అందరూ ఆనందించారు, ఈ కార్యక్రమంలో ప్రధాన ఉపాధ్యాయుడు నేతల నారాయణరావు, శ్యామల శకుంతల, అలాగే స్కూల్ చైర్మన్, తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎటువంటి ఆటంకాలు లేకుండా సంతోషకరంగా జరిగినందుకు ప్రధానోపాధ్యాయులు ఆనందం వ్యక్తం చేశారు.

## టీడీపీ సభ్యత కార్డులు పంపిణీ

**కుక్కునూరు, ఏప్రిల్ 16 (జనస్వరం) :** మండల కేంద్రంలో మండల పార్టీ అధ్యక్షుడు మొలిశెట్టి నాగు ఆధ్వర్యంలో టీడీపీ సభ్యత్వం కార్డులు అన్ని పంచాయతీలకు పంపిణీ చేశారు. టీడీపీ సీనియర్ నాయకులు కోటగిరి సత్యనారాయణ, టీడీపీ ఉపాధ్యక్షులు వెంకటరమణ, మేజర్ పంచాయతీ ఉప సర్పంచ్ పిచ్చుక రాజు వార్డు మెంబర్లు, గ్రామ కమిటీ చేతుల మీదుగా పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా టీడీపీ మండల అధ్యక్షులు మాట్లాడుతూ టీడీపీ సభ్యత్వం పొందిన ప్రతి ఒక్క కార్యకర్తకు ప్రభుత్వం నుండి వచ్చే ప్రతి ఫలం తప్పకుండా దక్కుతుందని, ప్రతి నాయకుడికి కార్యకర్తకు పార్టీ అండగా నిలబడి ఆదుకుంటుందని, కార్యకర్త దేవుళ్ళుగా భావించి ఏకైక పార్టీ టీడీపీ అని కొనియాడారు. ప్రతి కార్యకర్తకు అండదండలతో ఉండే పార్టీ ఏదైనా ఉందంటే అది టీడీపీ అనే సగర్వంగా చెప్పుకుంటున్నామన్నారు. పార్టీ కార్యకర్తలు నాయకులు అధిక సంఖ్యలో హాజరైయ్యారు. టీడీపీ సీనియర్ నాయకులు పులి శ్రీనివాస్, వార్డు మెంబర్లు రమాదేవి, అపర్ణ, రమణ రాజు, వివిధ పంచాయతీల గ్రామ వార్డు మెంబర్లు గ్రామ కమిటీ అధ్యక్షులు కార్యకర్తలు, అధిక సంఖ్యలో పాల్గొని ఈ సభ్యత కార్డులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గంజి రాంబాబు, గాడిద రాంబాబు, గరటం రమణ, నరేంద్ర రాజు, దుద్దుటూరు శీను, గురజాల నాగేశ్వరరావు, అపర్ణ సాయమ్మ, గుర్రం ఉదయ్ కుమార్, విలాసాగర్ రాంబాబు, మాచర్ల రమణయ్య, మాజీ ఎంపీటీసీ పుష్ప, పిచ్చుక హరిబాబు, పాల్గొన్నారు.